# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 211 | హైదరాబాద్ | గురువారం 12-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

భారత్-అమెరికా డీల్‌పై మాట మార్చిన వైట్‌హౌస్.. ఫ్యాక్ట్‌షీట్‌లో కీలక సవరణలు

## మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి: సీఎం

- ఐక్యంగా ఉంటేనే గుజరాత్ తరహాలో అభివృద్ధి సాధ్యమని స్పష్టం
- ప్రభుత్వ విజయాలను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలని, సభకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశం
- కేంద్రం సహకారంతోనే పోలవరం, అమరావతి,



11లో

స్టీల్ ప్లాంట్ వంటివి గాడిన పడ్డాయని వెల్లడి

- విభేదాలుంటే అంతర్గతంగా చర్చిద్దామని పవన్ పిలుపు



## అసెంబ్లీలో పవన్ కల్యాణ్ ఛాంబర్ కు వెళ్లి కలిసిన నారా లోకేశ్

11లో

## కొడంగల్ లో ఓటేసిన సీఎం.. మధిరలో డిప్యూటీ సీఎం

- మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రముఖులు
- మంచిర్యాలలో మంత్రి వివేక్ వెంకటస్వామి
- కేంద్రమంత్రి బండి సంజయ్, కామారెడ్డిలో షబ్బీర్ అలీ..
- సాయంత్రం 5 గంటలకు ముగియనున్న పోలింగ్



11లో

## మున్సిపల్ పోరు ముగిసె.. 'హస్తం' జోరు పెరిగె..?

- ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోలింగ్.. 13న ఫలితాలు
- 70 శాతం మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ విజయకేతనం..?
- నిజామాబాద్, కరీంనగర్‌లో బీజేపీ ఆధిక్యం.. బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ..!
- పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో ఆసక్తికర అంశాలు




12లో

## తెలంగాణలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్..

- రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు
- బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం
- ఈ నెల 13న ఓట్ల లెక్కింపు




11లో






## ఏపీలో ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్

11లో

- అర్హులైన 7,514 మందికి త్వరితగతిన పదోన్నతులు కల్పించాలన్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- 7,673 ఖాళీల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశం


## నరవణె పుస్తకం బయటకు ఎలా వచ్చింది? పెంగ్విన్ సంస్థకు ఢిల్లీ పోలీసుల నోటీసులు



11లో

- నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై రాజకీయ దుమారం
- పుస్తకం ప్రచురణ కాకముందే బయటకు రావడంపై ఢిల్లీ పోలీసుల ఆగ్రహం
- నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు




## మహా' నగరానికి మూడు ముఖాలు!

- జీహెచ్ఎంసీ వికేంద్రీకరణ.. కొత్తగా సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు
- 300 డివిజన్లతో సరికొత్త పాలనా చిత్రం.. అమల్లోకి వచ్చిన జీవో 55.
- ప్రత్యేక అధికారిగా జయేశ్ రంజన్.. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్.వి.కర్ణన్ బాధ్యతల స్వీకారం

12లో

భారతశక్తి

# పాక్ యూ టర్న్ వెనుక...

రోజుకో మలుపు తిరిగిన భారత్ – పాకిస్థాన్ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ ఎట్టకేలకు జరగనుంది. బంగ్లాదేశ్‌తో మొదలైన ఈ వివాదం చిలికి చిలికి ఓ పెద్ద గాలివానలా మారింది. బంగ్లాదేశ్‌ను టీ20 వరల్డ్‌కప్ నుంచి బహిష్కరించిన తర్వాత భారత్‌తో తాము మ్యాచ్ ఆడబోమంటూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు భీష్మించుకుని కూర్చుంది. పాక్ తీరు చూసి దాయాదుల పోరు జరగదేమో అని అందరూ అనుకున్నారు. కానీ ఓ అదృశ్య శక్తి ఎంట్రీతో పాక్ తోకముడవక తప్పలేదు. టీ ట్వంటీ ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకూడదన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న పాకిస్తాన్ చర్యపై ఆ దేశంలో విస్తృత చర్చ జరుగుతోంది. ఆ దేశపు క్రికెటర్లు అనేకమంది దీనిని 'పాక్ విజయం'గా చెప్పుకుంటున్నారు. "ఈ నిర్ణయం తీసుకున్నందుకు శ్రీలంక అధ్యక్షుడు పాకిస్తాన్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వాల జోక్యం వల్ల ఈ విషయం ఆట పరిధిని దాటి పోయింది. బంగ్లాదేశ్, ఇతర సభ్య దేశాల ప్రయోజనాల కోసం పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం అవసరం. ఎందుకంటే భారత్– పాక్ మ్యాచ్ ద్వారా వచ్చే ఆదాయంతో వాళ్లు కూడా ప్రయోజనం పొందుతారు" అని పాకిస్తాన్ మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ జియోన్యూస్‌తో అన్నారు "మేము పరిణతితో కూడిన నిర్ణయం తీసుకున్నాం. ఈ టోర్నీలో బంగ్లాదేశ్‌కు ఎదురైన నష్టాలకు పరిహారం దక్కాలి. మా మిత్ర దేశాల కోసం మేము భారత్‌తో మ్యాచ్ ఆడుతున్నాం. మేము కావాలనుకుంటే ఆదాయంలో మా వాటా పెంచాలని డిమాండ్ చేయవచ్చు. కానీ మేమలా చేయలేదు. హుందాగా వ్యవహరించాం" అని మరో క్రికెటర్ అహ్మద్ షాజాద్ అన్నారు. ఈ నిర్ణయంతో పాకిస్తాన్‌తోపాటు మిత్రదేశాల క్రికెట్‌కు మేలు జరుగుతుందని పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. "ఇప్పుడిక దీనిపై రాజకీయాలు అనవసరం. ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించాలి. మేమే గెలిచామని వాళ్లుగానీ, వీళ్లుగానీ చెప్పకూడదు" అని అహ్మద్ షాజాద్ చెప్పారు. "భారత్‌కు మాతో సమస్య ఉంటే, మాతో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించేది. కానీ వాళ్లలా చేయలేదు. పాకిస్తాన్ మ్యాచ్ ఆడేలా ఐసీసీ ఒప్పించింది. అంటే పాక్ లేకుండా క్రికెట్ టోర్నీ నడవదని వారికి తెలుసు. క్రికెట్‌కు మా అవసరం ఉంది. మా మిత్ర దేశాల కోసమే మేమీ నిర్ణయం తీసుకున్నాం. ఇది మంచి నిర్ణయం. ఇందులో మేం గెలిచాం" అని పాక్ మాజీ క్రికెటర్ సికిందర్ బఖ్త్ అన్నారు. దీనిపై స్పందించిన బీసీసీఐ, సమస్యను పరిష్కరించడంలో ఐసీసీ పాత్రను కొనియాడింది. "ఈ చర్చల ద్వారా బంగ్లాదేశ్ సెంటిమెంట్లను కూడా గౌరవించారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు కొంత ఉపశమనం లభించింది. వాళ్లు కూడా సంతోషంగా ఉన్నారు. ఐసీసీ ప్రయత్నాలను వాళ్లు కూడా అభినందిచారు'' అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నారు. "బీసీసీఐ శక్తివంతమైన సంస్థ. అయినప్పటికీ అది పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మీద ఆధారపడుతోంది. భారత్‌తో మ్యాచ్ ఆడాలా వద్దా అనేది పాక్ క్రికెట్ బోర్డు నిర్ణయిస్తుంది. మ్యాచ్ ఆడకపోతే విధించే జరిమానా చెల్లించడానికి పాక్ క్రికెట్ బోర్డు దగ్గర డబ్బుల్లేవు. అందుకే పాక్ ఈ మ్యాచ్ ఆడేందుకు ఒప్పుకుంది. బీసీసీఐకి డబ్బులే ముఖ్యం" అని శివ సేన(యూబీటీ) రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శించారు. "ఒక రకమైన డ్రామా నడుస్తోంది. కొన్నిసార్లు వాళ్లు భారత్‌తో మ్యాచ్ ఆడేది లేదంటారు. తర్వాత ఆడతామంటారు. అన్నీవాళ్ల సంతృప్తి కోసమే చేస్తారు. ఇప్పుడు బంగ్లాదేశ్, శ్రీలంక బతిమాలడంతో వాళ్లు ఒప్పుకున్నారు. భారత్ ఏ స్థాయిలో ఆధిపత్యం చలాయిస్తుందో ఇప్పుడు మనం ఐసీసీకి చూపించాం. అందుకే వాళ్లు ఇదంతా చేస్తున్నారు. దీనికి చికిత్స లేదు" అని భారత సీనియర్ క్రికెటర్ అతుల్ వాసన్ అన్నారు. టీ ట్వంటీ వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి15న భారత్‌తో ఆడాల్సిన మ్యాచ్ ఆడేందుకు పాక్ జట్టుకు అనుమతి ఇస్తూ ప్రధాని షాబాజ్ షరీఫ్ నిర్ణయం తీసుకున్నారు. మిత్రదేశాల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, ఐసీసీ ప్రతినిధులు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సభ్యుల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం గురించి ప్రధాని షాబాజ్ షరీఫ్‌కు పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహిసిన్ నఖ్వి వివరించారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అభ్యర్థనలు, శ్రీలంక క్రికెట్ బోర్డు రాసిన లేఖలు, యూఏఈ, ఇతర సభ్య దేశాల సందేశాల ఆధారంగా పాకిస్తాన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీబీసీ ఉర్దూ తెలిపింది. భారత్‌తో మ్యాచ్ విషయంలో పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస నాయకే కృతజ్ఞతలు తెలిపారు. మరో వైపు కిస్థాన్ రోజుల వ్యవధిలోనే తన మనసు మార్చుకొని, భారత్‌తో మ్యాచ్ ఆడాలని నిర్ణయించుకోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. ఐసీసీ చీఫ్‌గా ఉన్న జై షా పాకిస్థాన్ క్రికెట్ బోర్డును అష్ట దిగ్బంధనం చేశాడని చెప్పొచ్చు. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఇచ్చే రెవెన్యూ వాటాను ఆపేస్తామని, దీర్ఘకాలంపాటు ఆంక్షలు విధిస్తామని ఐసీసీ హెచ్చరించింది. మరోవైపు బ్రాడ్‌కాస్టర్ సైతం రంగంలోకి దిగి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీసీబీకి వార్నింగ్ ఇచ్చింది. అదే జరిగితే నష్ట పరిహారంగా పీసీబీ భారీ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. ఓవైపు ఐసీసీ నుంచి వచ్చే ఆదాయం ఆగిపోయి, మరోవైపు బ్రాడ్‌కాస్టర్‌తో న్యాయపోరాటం చేయాల్సి వస్తే.. పీసీబీ ఆర్థిక కష్టాలు మామూలుగా ఉండవు. ఇక భారత్‌లో టీ20 వరల్డ్ కప్ ఆడబోమంటూ టోర్నీ నుంచి బయటకు వెళ్లిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా.. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పీసీబీకి రిక్వెస్ట్ చేసింది. క్రికెట్ మంచి కోసం ఆడండి అని పైకి చెప్పినప్పటికీ.. అసలు కారణాలు మాత్రం వేరే. ఇప్పుడు పాకిస్థాన్ కనుక భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్‌తోపాటు టోర్నీ నుంచి అర్ధంతరంగా వైదొలిగిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుపైనా ఐసీసీ కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం. అదే జరిగితే రెండు బోర్డులూ తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటాయి. ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవడానికి బీసీబీ పాక్‌ను వాడుకుంది. బీసీబీపై పెనాల్టీ విధించొద్దని, భారత్ తమ దేశంలో మ్యాచ్‌లు ఆడకపోవడం వల్ల రెవెన్యూ తగ్గుతోంది కాబట్టి.. తమ రెవెన్యూ వాటా పెంచాలని.. భవిష్యత్తులో అండర్–19 వరల్డ్ కప్ లాంటి టోర్నీలను బంగ్లాదేశ్‌లో నిర్వహించేలా చూడాలన్న పీసీబీ డిమాండ్ చేసింది. అయితే బీసీబీపై జరిమానా విధించకుండా ఉండటం, జూనియర్ ఐసీసీ ఈవెంట్లకు బంగ్లా ఆతిథ్యం ఇవ్వడం పట్ల ఐసీసీ సానుకూలంగా స్పందించింది. ఓవైపు బ్రాడ్‌కస్టర్‌తో వార్నింగ్‌లు, రెవెన్యూ వాటాను ఆపేస్తామని ఐసీసీ హెచ్చరికలు.. శ్రీలంక, యూఏఈ క్రికెట్ బోర్డులు రాసిన లేఖలు.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సైతం ఆడమని కోరడం.. ఇవన్నీ కలిసి పాకిస్థాన్‌కు మరో దారి లేకుండా చేశాయి. వీటన్నింటి వెనుక ఉన్న శక్తి ఎవరో తెలుసు కదా..!

# వేటు కోసం కొలికపూడి నిరీక్షణ

విజయవాడ, ఫిబ్రవరి 11,



తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. అమరావతి ఉద్యమ నేతగా గుర్తింపు పొంది, చంద్రబాబు నాయుడు నమ్మకంతో టికెట్ ఇచ్చి గెలిపించిన కొలికపూడి.. ప్రస్తుతం అదే పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటిస్తున్నారా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. కొలికపూడి శ్రీనివాసరావు గత కొంతకాలంగా తన అసంతృప్తిని నేరుగా కాకుండా వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా వ్యక్తం చేస్తున్నారు. ఆయన పెట్టిన ఓ స్టేటస్ కూటమి ప్రభుత్వంలో కలకలం రేపింది. 3 వారాల పాటు 35 గ్రామాల్లో 480 కుటుంబాలతో ఆత్మీయ సంభాషణ జరిపాను.. రోడ్లు లేని పల్లెలు, ఉద్యోగాలు రాని పిల్లలు.. పల్లె కన్నీరు పెడుతోంది అనే అర్థం వచ్చేలా ఆయన పోస్ట్ చేయడం, పరోక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే అయి ఉండి, విపక్ష వైసీపీ విమర్శించే తీరులోనే ఆయన పోస్టులు ఉండటం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది. కేవలం ప్రభుత్వంపైనే కాకుండా, పార్టీలోని కీలక నేతలను కూడా ఆయన టార్గెట్ చేస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తన వద్ద టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత మొత్తం చెల్లించానని సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తన ప్రమేయం లేదని, పేకాట క్లబ్‌లు నడిపేవారికి పదవులు ఇస్తున్నారంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు టీడీపీ హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి. కొలికపూడి వైఖరి చూస్తుంటే ఆయన వైసీపీ వైపు అడుగులు వేస్తున్నారా అనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంపీ కేశినేని చిన్ని కూడా కొలికపూడిని వైసీపీ కోవర్టు గా అభివర్ణించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఆయన భేటీ అవ్వడం, వైసీపీ సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు రావడంతో.. ఆయన త్వరలోనే కండువా మార్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు ఇచ్చి వివరణ కోరింది. చంద్రబాబు నాయుడు కూడా గతంలో ఆయనను హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, కొలికపూడి మాత్రం తన తీరు మార్చుకోకపోగా, మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, అది తనకు రాజకీయంగా మైలేజ్ ఇస్తుందని, సానుభూతి పొందే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన తన నియోజకవర్గంలో సొంతంగా కార్యక్రమాలు చేసుకుంటూ, పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టేశారు. అలాగే టీడీపీ నుంచి కూడా ఆయనకు పిలుపులు రావడం లేదు.

వేటు కోసం

కొలికపూడి వ్యవహారం కేవలం ప్రజా సమస్యలకే పరిమితం కాలేదు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై ఆయన చేసిన ఆరోపణలు పార్టీలో భూకంపం సృష్టించాయి. టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత ఇచ్చానని ఆయన అనడం టీడీపీ క్రమశిక్షణను ప్రశ్నించేలా ఉంది. దీనికి ప్రతిగా ఎంపీ చిన్ని, కొలికపూడిని ''వైసీపీ కోవర్టు''గా అభివర్ణించడంతో ఈ వివాదం వ్యక్తిగత దూషణల స్థాయికి చేరుకుంది. నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, పేకాట క్లబ్ నిర్వాహకులకు పదవులు ఇస్తున్నారన్నది కొలికపూడి ప్రధాన ఆరోపణకొలికపూడి వైఖరిని గమనిస్తున్న విశ్లేషకులు దీని వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉందని భావిస్తున్నారు. పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, దానిని 'దళిత నేతపై అణచివేత'గా చిత్రీకరించి సానుభూతి పొందాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో భేటీ కావడం, స్థానిక వైసీపీ నేతలతో సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయన త్వరలోనే పార్టీ మారతారనే ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి. పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టి సొంతంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక కేడర్‌ను నిర్మించుకోవాలని ఆయన చూస్తున్నారు. ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ కొలికపూడికి నోటీసులు జారీ చేసింది. సాధారణంగా క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండే చంద్రబాబు, కొలికపూడి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఒకవేళ ఆయనను సస్పెండ్ చేస్తే అమరావతి ఉద్యమ నేపథ్యం ఉన్న వ్యక్తిని పంపించేశారనే అపవాదు వస్తుందని, అలాగని వదిలేస్తే మిగిలిన నేతలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని పార్టీ ఆందోళన చెందుతోంది. మొత్తానికి, తిరువూరు ఎమ్మెల్యే వ్యవహారం టీడీపీలో ఒక 'ముల్లు'లా మారింది. అభివృద్ధి జరగడం లేదని ఆయన అంటున్న మాటలు వాస్తవమా లేక వ్యక్తిగత ప్రయోజనాల కోసం చేస్తున్న రచ్చా అన్నది పక్కన పెడితే, ఇది కూటమి ప్రభుత్వ ప్రతిష్టను మాత్రం దెబ్బతీస్తోంది. కొలికపూడి స్వయంగా తప్పుకుంటారా లేక పార్టీయే వేటు వేస్తుందా అన్నది వేచి చూడాలి.

# ఆ ప్రాంతాలు.. ఇక సూపర్

నెల్లూరు, ఫిబ్రవరి 11,

రాష్ట్రంలో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు రైల్వే లైన్లను 4 వరుసలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మార్గంలో రైల్వే లైన్లు పెరగడం ద్వారా సరకు రవాణా వేగవంతంగా చేయవచ్చు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 774 రైల్వే లెవల్ క్రాసింగ్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీలను నిర్మించి, రైల్వే గేట్లు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. హైదరాబాద్–అమరావతి– చెన్నై, హైదరాబాద్–బెంగళూరు వంటి బుల్లెట్ రైలు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లడం వల్ల ఏపీకి భారీ ప్రయోజనం చేకూరుతుందని సీఎం చంద్రబాబు దీమా వ్యక్తం చేశారు. రైల్వేతో పాటు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సైతం నిధుల కొరత ఉన్న కారణంగా, అందుకు అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ఫోకస్ చేయాలని సూచించారు. గడువులోగా భూములు సేకరించేందుకు ప్రయత్నించాలని, తమకు సంబంధం లేదు అనేలా కలెక్టర్లు వ్యవహరించకూడదని మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు సూచించారుప్రస్తుతం ఉత్పత్తుల రవాణా ఖర్చు సగటున 14 శాతంగా ఉందని, దీనిని 7 నుంచి 8 శాతానికి తగ్గించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో ప్రస్తుతం 400 లక్షల టన్నుల ఉద్యాన పంటలు ఉత్పత్తి అవుతుండగా, రాబోయే ఐదేళ్లలో దీనిని 1,000 లక్షల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అనంతపురం నుంచి అరటిపండ్ల రవాణా తరహాలోనే అన్ని రకాల పంటల ఎగుమతుల కోసం మెరుగైన లాజిస్టిక్స్ సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే సీ ప్లేన్ల నిర్వహణలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలవబోతోందని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని భారీగా తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం యూనిట్‌కు రూ. 5.18 ఉన్న వ్యయాన్ని ఎలాగైనా సరే రూ. 4 లోపు (రూ. 3.90) తీసుకురావడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, స్టోరేజీ, డిస్ట్రిబ్యూషన్ అన్నీ ఒకే దగ్గర ఉండేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ట్రూడౌన్ ద్వారా వినియోగదారుడికి ప్రయోజనం దక్కేలా చూస్తామన్నారు. గతంలో నీటి కొరత, విద్యుత్ కొరత అధికంగా ఉండేది. ఇప్పుడు వాటిని అధిగమించామన్నారు. పర్యావరణ హితం కోసం ఆర్టీసీలో 1,000 విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, పీఎం కుసుమ్, సోలార్ రూఫ్ టాప్



ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూగర్భ జలాలు ఒక్క మీటరు పెరగడం ద్వారా మనకు రూ.4 వేల కోట్ల వరకు ఆదా అవుతుందని తెలిపారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా, నిర్లక్ష్యం లేకుండా కలెక్టర్లు, అధికారులు పనిచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

# వైసీపీ మౌనం - వ్యూహమా? వైఫల్యమా

విజయవాడ, ఫిబ్రవరి 11,

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడానికి సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మార్చి 9 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో రాజకీయ పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఈ తరుణంలో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పా అనుసరిస్తున్న మౌనం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న దాఖలాలు కనిపించకపోవడంతో, గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను



బహిష్కరించినట్లే.. ఇప్పుడు కూడా అదే బాటలో నడుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సూచనలు రాగానే అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంపై పార్టీలు కసరత్తు చేస్తాయి. కానీ వైసీపీలో ప్రస్తుతం అటువంటి సందడి ఎక్కడా కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత క్యాడర్‌ను తిరిగి సమీకరించడంలో నాయకత్వం కొంత తడబడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార కూటమి దూకుడుగా ఉండటం, పోలీసులు, అధికార యంత్రాంగంపై తమకు నమ్మకం లేదని గతంలోనే పార్టీ ప్రకటించినందున, పోటీకి దూరంగా ఉండటమే మేలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఎన్నికలను బహిష్కరిస్తే పరువు దక్కుతుందనేది ఒక వాదన అయితే, అది పార్టీ మనుగడకే ముప్పు అనే సంకేతాలు క్షేత్రస్థాయి నుంచి అందుతున్నాయి. స్థానిక ఎన్నికలు అంటే కేవలం పార్టీ గెలుపోటములే కాదు, గ్రామాల్లో నాయకులు తమ ఉనికిని కాపాడుకునే అవకాశం. ఒకవేళ పార్టీ పోటీ చేయకపోతే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా అనాథలయ్యే ప్రమాదం ఉంది. పోటీలో లేకపోతే క్యాడర్ నిరుత్సాహపడి, తమ రాజకీయ భవిష్యత్తు కోసం అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే అవకాశం ఉంది. రాజకీయాల్లో మైదానం వదిలి వెళ్లడం ఎప్పుడూ సరైన సంకేతం కాదు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీ గ్రాఫ్ తగ్గుతూ వస్తోందని ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్న తరుణంలో, స్థానిక ఎన్నికల నుంచి తప్పుకోవడం ఆ ప్రచారానికి బలం చేకూర్చినట్లు అవుతుంది. ఎన్నికల్లో ఓడినా పోరాడామనే ముద్ర ఉంటే భవిష్యత్తుపై ఆశ ఉంటుంది, కానీ పోటీనే చేయకపోతే పార్టీ బలహీనపడిందనే ముద్ర శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఇది పార్టీ నుంచి వలసలను ప్రోత్సహించడమే కాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ యంత్రాంగాన్ని దెబ్బతీస్తుందన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది. వైసీపీ నాయకత్వం ఈ ప్రచారాన్ని ఖండించి, కేడర్‌లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూనే, ప్రజాక్షేత్రంలో పోరాటం చేయడం ద్వారానే కోల్పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవచ్చు. పరీక్షల లోపే ఎన్నికలు పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు తగ్గట్టుగా, పార్టీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. లేనిప క్షంలో, ఈ స్థానిక ఎన్నికలు వైసీపీ ఉనికికి పెద్ద పరీక్షగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికలు బాయ్ కాట్

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో, గ్రామ పంచాయతీల గడువు ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మార్చిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేశాయి. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సంకేతాలు రాగానే పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంతో సందడి నెలకొంటుంది. కానీ, వైసీపీ క్యాంపులో కనిపిస్తున్న నిశ్శబ్దం పలు అనుమానాలకు తావిస్తోందిగతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించిన ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలోనూ పార్టీ నాయకత్వం అదే ఆలోచనలో ఉందన్న ప్రచారం సాగుతోంది. ఇందుకు అనేక కారణాలు కూడా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీసులు, అధికార యంత్రాంగం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వరని వైసీపీ ఆరోపిస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇంకా కోలుకోలేదు. ఆర్థికంగా, సామాజికంగా దాడులు ఎదుర్కొంటున్న తరుణంలో ఎన్నికల బరిలోకి దిగడం సాహసమేనని కొందరు భావిస్తున్నారు. ఓడిపోతే వచ్చే పరాభవం కంటే, వ్యవస్థలపై నిరసనగా పోటీకి దూరంగా ఉన్నామని చెప్పడం ద్వారా పార్టీ పరువు కాపాడుకోవచ్చనేది కొందరి వాదన. రాజకీయాల్లో 'మైదానం వదిలి వెళ్లడం' అంటే ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వడమే. స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కావు, అవి పార్టీ గ్రామస్థాయి ఉనికిని చాటుకునే అవకాశం కల్పిస్తాయి. పార్టీ పోటీ చేయకపోతే దశాబ్దాలుగా జెండా మోసిన కార్యకర్తలు రాజకీయంగా అనాథలవుతారు. తమ ఉనికి కోసం వారు అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే ప్రమాదం ఉంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో, ఎన్నికల నుంచి తప్పుకుంటే పార్టీ పూర్తిగా బలహీనపడిందనే ముద్ర పడుతుంది. ఇది పార్టీ నుంచి భారీ వలసలకు దారితీసే అవకాశం ఉంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. పోరాటం చేయకుండా తప్పుకోవడం వల్ల వైసీపీకి దీర్ఘకాలికంగా నష్టమే జరుగుతుంది. ఓడినా పోరాడామనే ముద్ర ఉంటేనే క్యాడర్‌లో భవిష్యత్తుపై ఆశ చిగురిస్తుంది. వైసీపీ నాయకత్వం అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతూనే, ప్రజాక్షేత్రంలో గట్టిగా నిలబడాలి. మార్చిలో జరగబోయే ఈ స్థానిక ఎన్నికలు వైసీపీకి ఒక "లిట్మస్ టెస్ట్" లాంటివి. ఈ పరీక్షలో పోటీ చేసి ఉనికిని చాటుకుంటుందో లేక బహిష్కరణ పేరుతో వెనకడుగు వేస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా, ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో వైసీపీ భవిష్యత్తును నిర్ణయించబోతోంది.

# జీడీపీలో వైజాగ్ ఫస్ట్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 11,

ఏపీ ప్రభుత్వం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం లెక్కలు విడుదల చేసింది. విశాఖపట్నం టాప్ ప్లేస్‌లో నిలిచింది. సీఎం చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులతో





నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం ప్రతి ఐదేళ్లకూ రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని చంద్రబాబు అధికారుల్ని ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలకు తలసరి ఆదాయం ప్రతీక అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంలో విశాఖపట్నం అదరగొట్టింది.. మొదటి స్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్థూల ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలిచింది. అయితే తలసరి ఆదాయంలో మాత్రం మూడో ప్లేస్‌లో నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జాతీయ ఆర్థిక సర్వే, జీఎస్‌డీపీ, జీడీపీలపై అధికారులతో చర్చించారు. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం గణాంకాలను (2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అంచనాలు) విడుదల చేసింది. జిల్లాల వారీగా జీడీపీ ముందస్తు అంచనాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం- రూ.1,60,771 కోట్లు, ఎన్టీఆర్ జిల్లా- రూ.1,05,173 కోట్లు, కృష్ణా జిల్లా-రూ.98,801 కోట్లు, తిరుపతి జిల్లా-రూ.98,526 కోట్లు, ఏలూరు జిల్లా- రూ.88,543 కోట్లు, నెల్లూరు జిల్లా-రూ.85,444 కోట్లు, గుంటూరు జిల్లా- రూ.83,618 కోట్లు, కడప జిల్లా- రూ.79,617 కోట్లు, అనంతపురం జిల్లా- రూ.76,849 కోట్లు, కాకినాడ జిల్లా-75,342 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లా-రూ.73,970 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా-రూ.70,512 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-రూ.63,190 కోట్లు, అనకాపల్లి జిల్లా-రూ.60,146 కోట్లు, కర్నూలు జిల్లా-రూ.54,452 కోట్లు, పల్నాడు జిల్లా- రూ.49,596 కోట్లు, చిత్తూరు జిల్లా రూ.49,303 కోట్లు, నంద్యాల జిల్లా-రూ.48,531 కోట్లు, బాపట్ల జిల్లా-రూ.48,457 కోట్లు, శ్రీకాకుళం జిల్లా-రూ.47,663 కోట్లు, ప్రకాశం జిల్లా- రూ.46,268 కోట్లు, విజయనగరం జిల్లా రూ.45,085 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా- రూ.44,859 కోట్లు, అన్నమయ్య జిల్లా రూ.36,035 కోట్లు, మార్కాపురం జిల్లా- రూ.29,031 కట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా రూ.18,583 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లా రూ.17,271 కోట్లు, పోలవరం జిల్లా- రూ.6,723 కోట్లు. జిల్లాల వారీగా తలసరి ఆదాయం చూస్తే.. విశాఖపట్నం-6,58,091, కృష్ణా-4,82,078, ఎన్టీఆర్ జిల్లా-3,91,390.. వరుసగా మూడు స్థానాల్లో ఉన్నాయి'ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలి. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుంది. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలి. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండు సార్లు పరిశీలన చేసుకోవాలి. పీ 4 అనేది రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం. మార్గదర్శులు బంగారు మిత్రలను నియమించుకోవాలి.. వారి ద్వారా ఆయా పేద కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాలన్నీ రీషెడ్యూలు చేస్తున్నాం. గత పాలనలో పాలకులు 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారు. జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టాం.. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. భవిష్యత్తులో ఆ జిల్లాలు మరింత వృద్ధిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి' అన్నారు చంద్రబాబు. పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. ఆశ్రమ హాస్టల్‌లో కలుషితమైన నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇక రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మంత్రులదే బాధ్యత. పంచాయితీరాజ్ రోడ్లు, నీటి సంరక్షణా చర్యలు, గోకులం షెడ్లు, మేజిక్ డ్రెయిన్లు చేపట్టాలి' అని సూచించారు.

# ఆస్తి పన్ను బకాయిలుంటే ఆస్తులు సీజ్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 11

విశాఖపట్నంలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై జీవీఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. నగరంలో మొండి బకాయిలను వసూలు చేసేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి ముందుగా నోటీసులు ఇస్తున్నారు.. ఒకవేళ వారు స్పందించని పక్షంలో ఆస్తుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అప్పటికి చెల్లించినవారికి ఊహించని షాకిస్తున్నారు.. ఆ ఆస్తుల్ని సీజ్ కూడా చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కఠినగా వ్యవహరిస్తుండటంతో పెండింగ్ బకాయిలు ఒక్కొక్కటిగా వసూలవుతున్నాయివిశాఖపట్నం జీవీఎంసీ పరిధిలో 6,02,937 ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు ఉంటే.. ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.566.41 కోట్లు పన్ను రావాలి. అయితే ఇప్పటి వరకు రూ.360 కోట్లు మాత్రమే చెల్లించగా.. మిగిలిన మొండి బకాయిల్ని కూడా రాబట్టేందుకు సిద్ధమయ్యారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మొండి బకాయిలపై ఫోకస్ పెట్టారు.. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి వరుసగా నోటీసులు జారీ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో లక్షా 36వేల 149మంది ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.. వీరందరికి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెళ్లాయి. వీరిలో లక్షా 10వేల 136మందికి అధికారులు నోటీసులు ఇచ్చారు.. అయితే వీరిలో కూడా కొందరి నుంచి స్పందన రాలేదు. ఈ క్రమంలో వారి ఆస్తుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ నోటీసులు పన్ను బకాయి వివరాలు ఉన్నాయి.. ఒకవేళ అప్పటికి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోతే.. వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు అధకారులు. ఇటీవల నగరంలోని ఓ సంస్థ మూడేళ్ల నుంచి రూ.87,74,916 పన్ను చెల్లించడం లేదు.. వారికి జప్తు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. ఈ క్రమంలో అధికారులు ఆ సంస్థ ముందు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే మరో




సంస్థ ఏకంగా ఐదేళ్ల నుంచి పన్ను చెల్లించడంలేదు.. అక్కడ కూడా హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. మరో వ్యక్తి తొమ్మిదేళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదు.. అక్కడ కూడా బోర్డు పెట్టారు. ఇలా బోర్డు పెట్టినా పన్ను చెల్లించనివారి ఆస్తుల్ని సీజ్ చేస్తున్నారు. ఈ తాజా పరిణామాలతో చాలామంది పన్నులు వసూలు చేస్తుండగా.. కొందరు మాత్రం వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదిలా ఉంటే.. విశాఖపట్నం జిల్లా తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా ఉంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సీఎం సోమవారం రోజు మంత్రులు, కార్యదర్శులలతో అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో గత ఏడాది విశాఖపట్నం జిల్లా.. స్థూల ఉత్పత్తిలో రూ.1,44,192 కోట్లతో ప్రథమ స్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా రూ.1,60,771 కోట్లతో ఫస్ట్ ప్లేస్‌లో నిలబడింది.

# కొరకరాని కొయ్యగా విష్ణుకుమార్ రాజు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 11, (

కూటమి ప్రభుత్వంలో విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కొరకరాని కొయ్యగా మారారు. ఆయన వ్యాఖ్యలు ప్రభుత్వంతో పాటు కూటమిని కూడా ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. వరసగా ఆయన ప్రభుత్వానికి, కూటమికి వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లోకి బలంగా వెళుతున్నాయి. విష్ణుకుమార్ రాజు రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో బీజేపీ నుంచి గెలిచిన విష్ణుకుమార్ రాజు 2024 అంటే పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికయ్యారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆయన రూటు మారింది. గతంలో వైసీపీ ప్రభుత్వం పై విరుచుకుపడిన విష్ణుకుమార్ రాజు ఇప్పుడు అధికార పక్షంలో ఉంటూ కూడా తాను ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. విష్ణుకుమార్ రాజు కొంత ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉన్నందున ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారన్నకామెంట్స్ కూడా ఎక్కువగా వినపడుతున్నాయి. ఇటీవల రుషికొండ ప్యాలెస్ పై మంత్రి వర్గ ఉప సంఘం తీసుకున్న నిర్ణయాన్ని విష్ణుకుమార్ రాజు తప్పు పట్టారు. దానిని స్టార్ హోటల్ కు ఇస్తే సామాన్యులకు ఎలా ప్రవేశం దొరకుతుందని ఆయన సూటిగానే ప్రశ్నించి ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టారు. తర్వాత భోగాపురం ఎయిర్ పోర్టు లో ట్రయల్ రన్ పూర్తయిన సందర్భంగా కూడా విష్ణుకుమార్ రాజు వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే కంటే విశాఖ నుంచి విజయవాడకు వందేభార్ రైలులో వెళితే సమయం ఆదాఅవుతుందని చెప్పి ఇబ్బందిలోకి నెట్టారు. రైల్వే మంత్రికి విశాఖ నుంచి విజయవాడకు వందే భారత్ రైళ్లు



వేయాలని తాను కోరతానని విష్ణుకుమార్ రాజు చెప్పారు. ఇక గూగుల్ డేటా సెంటర్ పై కూడా ఆయన వ్యాఖ్యలు కూటమి పార్టీలో కలకలం రేపాయి. గూగుల్ డేటా సెంటర్ వస్తే విశాఖ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని, పర్యావరణం దెబ్బతింటుందన్న ఆందోళలనను విష్ణుకుమార్ రాజు చేశారు. గూగుల్ డేటా సెంటర్ తీసుకు వచ్చిన ఆనందాన్ని కూటమి నేతల్లో విష్ణు ఆవిరి చేసిపారేశారు. ఇక తాజాగా మాజీ మంత్రులు, అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులను కూడా ఖండించారు. అలా ఇళ్ల మీద దాడులు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. అయితే విష్ణుకుమార్ రాజు పబ్లిక్ పల్స్ మాత్రమే చెబుతున్నానని అంటున్నారు. ప్రజలు అనుకుంటున్నదే తాను అంటున్నానని, ప్రభుత్వం మార్చుకుంటే మంచిదని సూచిస్తున్నారు. మొత్తం మీద బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తనకు మంత్రి పదవి రాలేదన్న ఆగ్రహంతోనే ఈ వ్యాఖ్యలు చేస్తుండ ఉండి వచ్చని కూటమి నేతలు అంటున్నారు.

# శివకుమార్ పట్టాభిషేకానికి ముహూర్తం ఫిక్స్ ?

బెంగళూరు, ఫిబ్రవరి 11

కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. ఇప్పటివరకూ తెర వెనుక సాగిన సీఎం మార్పు చర్చలు ఇప్పుడు బాహాటంగా రోడ్డుపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలంటూ ఎమ్మెల్యేలు బహిరంగంగా డిమాండ్ చేయడం కన్నడ రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టిస్తోంది. తాజా రాజకీయ ప్రకంపనలకు కేంద్ర బిందువు ఎమ్మెల్యేలు ఇక్బాల్ హుస్సేన్, చెన్నరాజ్ హట్టిహోలి. వీళ్లిద్దరూ డీకేకు కేవలం మద్దతు తెలపడమే కాకుండా, హైకమాండ్ ముందున్న లెక్కలను కూడా బయటపెట్టారు. పార్టీ కోసం రక్తం చిందించిన డీకేకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఇప్పటికే 80 నుండి 90 మంది ఎమ్మెల్యేలు



అధిష్టానానికి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన బహిరంగంగానే వెల్లడించారు. దీనికి మరో ఎమ్మెల్యే చెన్నరాజ్ హట్టిహోలి మరింత బలాన్ని చేకూర్చారు. "80 మంది కాదు, కాంగ్రెస్ నుంచి గెలిచిన మొత్తం 136 మంది ఎమ్మెల్యేలూ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు" అని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఏదో యాదృచ్ఛికంగా చేసినవి కావని, సిద్ధరామయ్య క్యాంప్‌కు ఒక స్పష్టమైన హెచ్చరిక లాంటివని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2023 మేలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఈ సీటుపై గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించిన తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం కోసం పెద్ద యుద్ధమే జరిగింది. అప్పట్లో ఢిల్లీ పెద్దలు కుదిర్చిన '30 నెలల ఫార్ములా' అంటే రెండున్నరేళ్ల ఒప్పందం ఇప్పుడు డీకే వర్గానికి అస్త్రంగా మారింది. ఆ గడువు ముగియడంతోనే, ఎమ్మెల్యేలు ఇప్పుడు తమ గళాన్ని పెంచారు. సాధారణంగా ఏ పార్టీలోనైనా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి వ్యతిరేకంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుంది. కానీ, డీకే శివకుమార్ అనుచరులు ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నారంటే దీని వెనుక బలమైన స్కెచ్ ఉంది. సిద్ధరామయ్య ప్రజాకర్షణ ముందు డీకే వెనుకబడిపోకుండా, ఎమ్మెల్యేల బలం తనకే ఉందని నిరూపించుకోవడం దీని వెనుక ఉద్దేశం. సిద్ధరామయ్య తన 'అహింద' ఓటు బ్యాంకుతో పట్టు బిగిస్తుంటే, డీకే తన 'ఒక్కలిగ' సామాజిక వర్గ ఎమ్మెల్యేలను ఏకం చేస్తున్నారు. సిద్ధరామయ్య చుట్టూ ముదురుతున్న ముడా కేసు దర్యాప్తును ఆసరాగా చేసుకుని, నైతికత పేరుతో పదవిని బదిలీ చేయాలని కోరడం కూడా దీని వెనుక వ్యూహం కావచ్చు. ఎమ్మెల్యేలు బహిరంగంగా ప్రకటనలు చేస్తుంటే అధిష్టానం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

సిద్ధరామయ్యను తప్పిస్తే వెనుకబడిన వర్గాలు ఏమౌతాయి? డీకేకు అవకాశం ఇవ్వకపోతే పార్టీకి ఆర్థిక బలం, ట్రబుల్ షూటింగ్ నెరవేరుతుందా? అనే సంకటంలో ఢిల్లీ పెద్దలు ఉన్నారు. మొత్తానికి ఎమ్మెల్యేల బహిరంగ వ్యాఖ్యలు కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు కేవలం ఊహాగానం కాదు, ఒక కార్యాచరణ అని స్పష్టం చేస్తోంది. డీకే శివకుమార్ వ్యూహాత్మకంగా తన అనుచరుల ద్వారా పావులు కదుపుతున్నారు. త్వరలోనే తనకు పట్టాభిషేకం ఖాయమనే ఆలోచనలో డీకే ఉన్నారు. ఆయన అనుచరుల తాజా వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. హైకమాండ్ పైన ఒత్తిడి తీసుకురావడం ద్వారా తమ పంచాన్ని నెగ్గించుకోవాలనుకుంటున్నారు. మరి సిద్ధరామయ్య ఈ ఎమ్మెల్యేల అస్త్రం నుండి తన కుర్చీని ఎలా కాపాడుకుంటారో చూడాలి.

# మీనాక్షి తెలంగాణ ఇన్ ఛార్జిగా ఉన్నారా

హైదరాబాద్, ఫిబ్రవరి 11



తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ లో జరుగుతున్న వ్యవహారాలను పట్టించుకోవడం లేదనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వివిధ చోట్ల రెబెల్స్ నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ ఎలాంటి చర్యలకు ఆమె దిగడం లేదు. పార్టీ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాల విషయంలో మీనాక్షి నటరాజన్ నానుస్తున్నారని అన్నారు. కనీసం మీనాక్షి నటరాజన్ రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామాలను హైకమాండ్ కు అసలు చెబుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా ఉంది. ఆమె ఏదో ఇన్ ఛార్జిగా ఉన్నట్లే ఉంటున్నారు తప్పించి ఎలాంటి కఠిన నిర్ణయాల వంటి జోలికి వెళ్లడం లేదు. దీనిని అలుసుగా తీసుకుని కాంగ్రెస్ నేతలు కొందరు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయిమీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీ కోటరీలో వ్యక్తి అంటారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటారనే ఆమెను తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జిగా నియమించారు. మీనాక్షి నటరాజన్ చాలా సింపుల్ గా ఉంటారు. గతంలో ఇన్ ఛార్జుల మాదిరిగా మీనాక్షి పార్టీ బలోపేతానికి తప్పించి మరే ఆలోచన చేయరు. తెలంగాణకు వస్తే హంగు ఆర్భాటాలను కూడా ప్రదర్శించరు. స్టార్ హోటల్స్ బస చేయరు. అలాగే ఏ స్థాయి నేత ఫోన్ చేసిన వెంటనే రెస్పాండ్ అవుతారు. అలాంటి మీనాక్షి నటరాజన్ గత కొద్ది రోజుల నుంచి తెలంగాణ కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలపై ఆమె స్పందించకపోవడం, పార్టీ అగ్ర నాయకత్వానికి కూడా తెలియజేయకపోవడంపైనే ఇప్పుడు గాంధీ భవన్ లో చర్చ జరుగుతుంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కానీ, పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలకు సంబంధించి అసలు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా నేతల్లో ఉంది. జీవన్ రెడ్డి వ్యవహారం తీసుకుంటే అది వెంటనే హైకమాండ్ కు చేరవేయాలి. ఆయన దశాబ్దాలుగా పార్టీలో ఉన్న నేత అని మీనాక్షికి తెలుసు. కనీసం ఆయన వద్దకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం కూడా మీనాక్షి చేయలేదు. అంటే రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చేదానికి ఇక ఇన్ ఛార్జి ఎందుకన్న సందేహం సాధారణంగా కార్యకర్తల్లోనూ వ్యక్తమవుతుంది. అప్పుడప్పుడు ఇలా వచ్చి అలా మౌనంగా మీనాక్షి నటరాజన్ వెళ్లిపోతుంటే పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టులా తయారవుతుందన్న ఆందోళన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతుంది.

==================

# బీఆర్ఎస్ ఏజెంట్ ను అడ్డుకున్న పోలీసులు

మంచిర్యాల ఫిబ్రవరి 11 (

మంచిర్యాల జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల ఓవర్ యాక్షన్ చూపించారు. లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 9,10 పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ ఏజెంట్గా ఉన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ను పోలీసులు పోలింగ్ బూత్ లోపలికి వెళ్లకుండా అడ్డుకుని, నెట్టివేసారు. దాంతో అయనే పోలీసుల తీరును నిరసిస్తూ పోలింగ్ కేంద్రం ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేసారు.

# రహదారి భద్రతపై పోలీసుల వినూత్న ప్రచారం:

## టోల్ ప్లాజా వద్ద వాహనదారులచే 'హెల్మెట్' ధారణ ప్రమాణం!

ఒంగోలు ఫిబ్రవరి 11 (

టంగుటూరు టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి, వారికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాల్లో తలకు తగిలే గాయాలే మరణాలకు ప్రధాన కారణమని, హెల్మెట్ ప్రాణ రక్షక కవచంలా పనిచేస్తుందని పోలీసులు వివరించారు. అనంతరం వాహనదారులందరిచే "నేటి నుండి ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తాం" అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల క్షేమం కోసమైనా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. పోలీసుల ఈ వినూత్న చొరవను ప్రయాణికులు మరియు స్థానికులు అభినందించారు.

# మహబూబ్ నగర్ కార్పొరేషన్లో పోలింగ్ కేంద్రాల సందర్శన

## భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష

మహబూబ్ నగర్ ఫిబ్రవరి 11

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మహబూబ్నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, మహబూబ్నగర్ కార్పొరేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ బ్రిలియంట్ స్కూల్, ఠాగూర్ స్కూల్, గాంధీ రోడ్ స్కూల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, సిబ్బంది విధులు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, క్యూలైన్ నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అక్కడి అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు.

జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని తెలిపారు. సీఐలు, డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు విధులు నిర్వర్తిస్తూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయని పేర్కొన్నారు. అదనంగా రూట్ మొబైల్ బృందాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాంతి భద్రతలను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నాయని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యే వరకు పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.

---

# ట్రయాంగిల్ ఫైట్ లో గెలుపు ఎవరిది

హైదరాబాద్, ఫిబ్రవరి 11

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల క్లైమాక్స్ మొదలైంది. పార్టీలు జారీ చేసిన బీ-ఫారాలు ఒకరికి దక్కితే, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించారంటూ పలువురు నేతలు స్వతంత్రులుగా జెండా ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,700 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నప్పటికీ, ఇంకా 12,900 మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో మెజారిటీ అభ్యర్థులు ప్రధాన పార్టీలకు చెందిన రెబల్స్ కావడం గమనార్హం. గెలుపు గుర్రాల కంటే, ప్రత్యర్థి గెలుపును అడ్డుకునే ఓట్ల చీలిక వ్యూహంతో వీరు ముందుకు వెళ్తుండటం పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా ఉంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ సమస్య అత్యధికంగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని భావించిన ఆశావాహులు టికెట్ ఆశించారు. కానీ ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై పాత క్యాడర్ భగ్గుమంటోంది. ఉదాహరణకు జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి , ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య టికెట్ల కేటాయింపు వివాదం రచ్చకెక్కింది. ఇలాంటి పరిస్థితులే మెదక్, గద్వాల వంటి చోట్ల కూడా కనిపిస్తున్నాయి. బీ-ఫారాల పంపిణీలో జరిగిన జాప్యం , సమన్వయ లోపం వల్ల కాంగ్రెస్‌లో రెబల్స్ సంఖ్య పెరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. పార్టీని నమ్ముకుని ఉన్న స్థానిక నేతలు, టికెట్ దక్కని పక్షంలో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని భావించి బరిలోకి దిగారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా సొంత పార్టీ వారే భారీగా నామినేషన్లు వేశారు. కొందరు నేతలు ఇతర పార్టీల నుంచి వచ్చిన విమర్శలకు కౌంటర్ ఇవ్వడం కంటే, సొంత పార్టీ అభ్యర్థులనే టార్గెట్ చేయడం అధిష్టానాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. క్రమశిక్షణ చర్యల హెచ్చరికలు జారీ చేసినా చాలా మంది వెనక్కి తగ్గకపోవడం గమనార్హం. కేంద్రంలో అధికారంలో ఉండటం, రాష్ట్రంలోనూ పుంజుకుంటున్నామన్న ధీమాతో ఉన్న బీజేపీలోనూ రెబల్స్ బెడద తప్పలేదు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ పకడ్బందీగా అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని చోట్ల ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారికి కాకుండా కొత్తగా చేరిన వారికి టికెట్లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు రెబల్స్ పై సీరియస్ అయ్యారు. నామినేషన్లు ఉపసంహరించుకోని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ, నిజామాబాద్, అదిలాబాద్ వంటి ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు రెబల్స్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ రెబల్స్ ప్రభావం వల్ల బహుముఖ పోటీ నెలకొంది. విజేతను నిర్ణయించే మేజారిటీ ఓట్లు ఈ స్వతంత్రుల ఖాతాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. కేవలం 100 నుండి 500 ఓట్ల తేడాతో గెలుపోటములు నిర్ణయమయ్యే మున్సిపల్ వార్డుల్లో, ఈ రెబల్స్




చీల్చే 50 ఓట్లు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తాయి. దీనివల్ల కొన్ని చోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓడిపోయి, స్వతంత్రులు కింగ్ మేకర్లుగా లేదా విజేతలుగా అవతరించే అవకాశం ఉంది.

ఈ ఎన్నికలు ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, విపక్ష బీజేపీ మధ్య ముక్కోణపు పోటీని తలపిస్తున్నాయి. ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి మున్సిపోల్స్ కావడంతో, కాంగ్రెస్ దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు తమను గెలిపిస్తాయని ఆ పార్టీ నమ్ముతోంది. మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోవడం ద్వారా రాష్ట్రంపై తమ పట్టును నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహరచన చేశారు. తమ పదేళ్ల అభివృద్ధి పనులే తమకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో తమకు బలమైన క్యాడర్ ఉందని, అక్కడ మెరుగైన ఫలితాలు సాధిస్తామని గులాబీ దళం ఆశిస్తోంది. ఉత్తర తెలంగాణపై బీజేపీ గట్టి ఆశలు పెట్టుకుంది. పట్టణ ప్రాంత ఓటు బ్యాంకు సంప్రదాయబద్ధంగా తమకే మద్దతు ఇస్తుందని ఆ పార్టీ నమ్ముతోంది. నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమైంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం, ఈ ఎన్నికల్లో ప్రాంతాల వారీగా విభిన్నమైన ట్రెండ్ కనిపిస్తోంది. ఉత్తర తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు సాగనుంది. రామగుండం, నిజామాబాద్ వంటి కార్పొరేషన్లలో బీజేపీ సత్తా చాటాలని చూస్తోంది. ఇక దక్షిణ తెలంగాణలోని మహబూబ్ నగర్, నల్గొండ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ బలంగా ఉన్నప్పటికీ, అధికార బలం కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అవకాశం ఉంది. మొదటి స్థానంలో నిలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, ప్రధాన ప్రతిపక్షం తామే అని నిరూపించుకోవడానికి బీఆర్ఎస్, బీజేపీ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. మొత్తం 2,996 వార్డుల్లో సుమారు 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాలు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ దిశను నిర్దేశించనున్నాయి. ఓటర్లు తమ నగరాల, పట్టణాల అభివృద్ధి కోసం ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

---

# అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (


తెలంగాణ రాజకీయాల్లో మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీది ఒక ప్రత్యేకమైన శైలి. ఇటీవల అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "రెడ్డి అయినా, రావు అయినా తమ దగ్గరకు రావాల్సిందే" అని ఆయన అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న రాజకీయ చతురతను, గత కొన్ని దశాబ్దాల ఎంఐఎం ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఇది కేవలం ఒక పార్టీ ఆధిపత్యం మాత్రమే కాదు.., అధికార పార్టీలు, ఎంఐఎం మధ్య ఉన్న 'పరస్పర ప్రయోజనాల' బంధమని స్పష్టమవుతుంది. ఎంఐఎం పార్టీ పుట్టినప్పటి నుంచి అనుసరిస్తున్న ఏకైక సూత్రం "అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ" చేయడం. ఇది సిద్ధాంతాల కంటే ఎక్కువగా ప్రయోజనాల మీద ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాం నుంచి మొదలుకొని, నేటి తెలంగాణ వరకు ఈ ధోరణి కొనసాగుతూనే ఉంది. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంత దూరం ఉన్నప్పటికీ, ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు హయాంలోనూ, ఆపై వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలోనూ ఎంఐఎం అత్యంత కీలక పాత్ర పోషించింది. కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో పాతబస్తీలో జరిగిన కొన్ని పరిణామాల వల్ల ఎంఐఎం కాంగ్రెస్‌కు దూరమైంది. కానీ, రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే, కేసీఆర్‌తో ఫ్రెండ్లీ బంధాన్ని కొనసాగించింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్‌తోనూ అదే తరహా అనుబంధాన్ని కొనసాగిస్తోంది. అక్బరుద్దీన్ ఓవైసీ అన్నట్లుగా పార్టీలే తమ దగ్గరకు వస్తాయా? లేక వీరే వెళ్తారా? అనేది ఒక నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల వంటిది. కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ వంటి పార్టీలకు ముస్లిం ఓటు బ్యాంకు కీలకం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30-40 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. ఎంఐఎంతో దోస్తీ చేయడం వల్ల మైనారిటీల్లో ఒక 'పాజిటివ్ మెసేజ్' వెళ్తుందని, తద్వారా ఆయా వర్గాల ఓట్లు తమకే పడతాయని అధికార పార్టీలు భావిస్తాయి. ఎంఐఎం బలం కేవలం పాతబస్తీలోని ఏడు అసెంబ్లీ స్థానాలకే పరిమితం. పాతబస్తీలో తమ పట్టును నిలుపుకోవాలన్నా, తమ నియోజకవర్గాలకు నిధులు కావాలన్నా, లేదా తమ మద్దతుదారుల వ్యాపార సామ్రాజ్యాలకు రక్షణ ఉండాలన్నా అధికారంలో ఉన్న పార్టీతో సత్సంబంధాలు ఎంఐఎంకు అత్యవసరం. జూబ్లీహిల్స్ బైపోల్ ప్రస్తావన తెస్తూ అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తికరమైనవి. అయితే మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చినట్లుగా, ప్రతి నియోజకవర్గంలోనూ సమీకరణాలు వేరుగా ఉంటాయి. జూబ్లీహిల్స్ వంటి చోట్ల ఎంఐఎంకు గణనీయమైన ఓట్లు ఉన్నప్పటికీ, గెలుపు అనేది అభ్యర్థి వ్యక్తిగత బలం, అధికార పార్టీ మేనిఫెస్టోపై కూడా ఆధారపడి ఉంటుంది. ఇక్కడ ఎంఐఎం మద్దతు 'అదనపు బలం' కావొచ్చు కానీ, అదే 'ఏకైక బలం' అని చెప్పలేం. నిజానికి ఎంఐఎం ఎప్పుడూ 'కింగ్ మేకర్' కావాలని కోరుకోదు. ఎందుకంటే కింగ్ మేకర్ కావాలంటే ప్రభుత్వాలు పడిపోయే స్థితిలో ఉండాలి. కానీ తెలంగాణలో మెజారిటీ ప్రభుత్వాలు ఉన్నా ఎంఐఎం వారితో స్నేహం చేస్తుంది. అంటే వారు 'కింగ్ తో ఉండే పార్టీ'గా ఉండటానికే ఇష్టపడతారు. దీనివల్ల ప్రభుత్వ నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అవుతుంది. పోలీస్ యంత్రాంగం, పరిపాలనలో పాతబస్తీపై తమ గుత్తాధిపత్యం కొనసాగుతుంది. విపక్షంలో ఉండి పోరాటాలు చేసే శ్రమ తప్పుతుంది. అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు తమ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి, తమ ప్రాధాన్యతను తగ్గకుండా చూసుకోవడానికి చేసిన 'మైండ్ గేమ్'గా విశ్లేషకులు భావిస్తున్నారు. రెడ్డి అయినా, రావు అయినా చివరకు రాజకీయ ప్రయోజనాల కోసం ఒకరిపై ఒకరు ఆధారపడక తప్పని పరిస్థితి తెలంగాణలో ఉంది. ఎంఐఎంకు అధికారం కావాలి, అధికార పార్టీకి ముస్లిం ఓట్లు కావాలి. ఈ సమీకరణం ఉన్నంత కాలం "ఎవరు ఎవరి దగ్గరకు వెళ్లారు" అనే చర్చ కంటే, "ఎవరు ఎవరిని ఎంత ఉపయోగించుకున్నారు" అనేదే అసలైన రాజకీయం. అక్బరుద్దీన్ వ్యాఖ్యలు కేవలం పైన కనిపించే కోణం మాత్రమే.. లోపల ఉన్నది మాత్రం పక్కా రాజకీయ అవసరాల బంధం.

---

# ఏప్రిల్ లో తెలంగాణ జాగృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 11

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరగబోతోంది. గత కొంతకాలంగా మౌనంగా ఉంటూనే తన వ్యూహాలకు పదును పెట్టిన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరికొత్త రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టబోతున్నారు. తన స్వచ్ఛంద సంస్థ 'తెలంగాణ జాగృతి'ని పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వచ్చే ఏప్రిల్ నెలాఖరులో లేదా మే మొదటి వారంలో ఈ నూతన పార్టీ అధికారికంగా ప్రజల ముందుకు రానుంది. కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అన్ని సాంకేతిక, చట్టపరమైన చర్యలను కవిత బృందం పూర్తి చేసింది. గత నెలలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి అవసరమైన అన్ని పత్రాలతో కూడిన దరఖాస్తును అందజేశారు. ఈసీఐ నిబంధనల ప్రకారం పార్టీ పేరు నమోదు, ఇతర వివరాల పరిశీలనకు సాధారణంగా రెండు నెలల సమయం పడుతుంది. అన్నీ సవ్యంగా సాగితే, ఉగాది పర్వదినం తర్వాత, ఏప్రిల్ ఆఖరి వారంలో ఒక మంచి ముహూర్తాన్ని చూసుకుని కవిత తన పార్టీ జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. భారత రాష్ట్ర సమితి ) నుంచి



సస్పెన్షన్‌కు గురైన తర్వాత కవిత తన రాజకీయ పంథాను పూర్తిగా మార్చుకున్నారు. కేవలం తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని తెలుసుకునేందుకు జాగృతి జనంబాట పేరుతో పర్యటనలు చేపట్టారు. కేవలం భావోద్వేగాల మీద కాకుండా, ప్రజా సమస్యల ప్రాతిపదికన పార్టీ విధానాలు ఉండాలని ఆమె భావిస్తున్నారు. వివిధ సామాజిక వర్గాల సమస్యలు, ఆర్థిక స్థితిగతులు, రైతాంగ ఇబ్బందులపై అధ్యయనం చేయడానికి 50 కమిటీలను ఏర్పాటు చేశారు. మేధావులు, విద్యార్థులు, కుల వృత్తుల వారితో సమావేశమై పార్టీ ఎజెండా రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని తీసుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారు, అమరవీరుల కుటుంబాలు 'జాగృతి' నీడలోకి రావాలని ఆమె బహిరంగంగానే విజ్ఞప్తి చేశారు. ఈ కొత్త పార్టీ రూపకల్పన వెనుక ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ టీం పని చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ నుండి క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నిర్మాణ వరకు పీకే సలహాలను కవిత తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, రాబోయే జీహెచ్ఎంసీ ( ఎన్నికలే ఈ పార్టీకి మొదటి పరీక్ష కానున్నాయి. ఒకవేళ ఈసీఐ నుంచి గుర్తింపు సకాలంలో వస్తే, హైదరాబాద్ నగర వ్యాప్తంగా అభ్యర్థులను నిలబెట్టి తన సత్తా చాటాలని కవిత యోచిస్తున్నారు. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రధాన రాజకీయ శక్తిగా ఎదగాలన్నది ఆమె మాస్టర్ ప్లాన్. "నా రాజకీయ భవిష్యత్తు కోసం పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేసుకున్నాను. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు ఈ పార్టీ నాంది పలుకుతుంది" అని కవిత ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'సామాజిక తెలంగాణ' నినాదంతో, అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ ఎజెండా ఉండబోతున్నట్లు సమాచారం. త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను ప్రకటించనున్నారు. అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య 'జాగృతి' ఏ మేరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి

---

# పేద రోగులకు రోబోటిక్ విధానంలో ఫ్రీగా సర్జరీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద రోగులకు ఎంఎన్‌జే ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీలు చేస్తున్నారు. రోబోటిక్ విధానంలో రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేస్తున్నారు. గత రెండున్నరేళ్లలో ఆసుపత్రిలో రూ. 12.5 కోట్ల విలువైన సర్జరీలు చేసినట్లు వైద్యులు వెల్లడించారు. పేద రోగులకు నిజంగా ఇది వరమనే చెప్పాలి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పేద రోగులకు రోబోటిక్ విధానంలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. అవి కూడా ఉచితంగా. గడిచిన 30 నెలల వ్యవధిలో దాదాపు రూ. 12.5 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా పేద రోగులకు అందిస్తున్నారు. గత రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో 250 వరకు రోబోటిక్ సర్జరీలు చేశారు. హైదరాబాద్ నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, సరిహద్దు రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ 700-800 వరకు రోగులు క్యాన్సర్ చికిత్సల కోసం ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా చాలామంది రోగులు వస్తుంటారు. సాధారణంగా ఒక రోబో సర్జరీకి ప్రైవేటు ఆసుపత్రిలో అయితే రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఎంఎన్‌జేకు ఒక్కో రోబో సర్జరీకి రూ. 1.5 లక్షల వరకు చెల్లిస్తోంది. కిడ్నీ, పెద్దపేగు, గ్యాస్ట్రిక్, గర్భసంచి, అన్నవాహిక, ప్రొస్టేట్ క్యాన్సర్లకు గతంలో కోత పెట్టి క్యాన్సర్ గడ్డలను తొలగించే వారు. అయితే అతి చిన్న క్యాన్సర్ గడ్డలను తొలగించడానికి డాక్టర్లకు కొన్నిసార్లు సాధ్యమయ్యేది కాదు. అధిక రక్త స్రావంతో పేషెంట్లు ఎక్కువ రోజులు హాస్పిటల్స్‌లోనే ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం అత్యాధునిక సర్జికల్ రోబోతో అతి చిన్న కణతులను చాలా ఈజీగా తొలగిస్తున్నారు.

# తెలంగాణకు కొత్తగా మద్యం బ్రాండ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 11

ప్రపంచంలో కొన్ని వేల రకాల మద్యం బ్రాండ్లు ఉన్నాయి. కానీ, మందుబాబులు ఎక్కువగా తాగేది బీరే. కొంతమంది కొత్త వెరైటీలు టేస్ట్ చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలోనూ కొన్ని మద్యం బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త బ్రాండ్లు, విదేశీ బ్రాండ్లు కావాలని చాలా మంది కొరుకుంటుంటారు.



అయితే, వారి కోరిక ఫలించేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్త బ్రాండ్లకు అనుమతి ఇవ్వాలని డిసైడ్ అయింది. రాష్ట్రంలో త్వరలో నూతన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ మేరకు గతంలో ప్రభుత్వం చేసిన కసరత్తు తర్వాత పెద్ద ఎత్తున విమర్శలు రాగా.. ఆ ప్రక్రియను తాత్కాలికంగా ప్రభుత్వం విరమించుకున్నది. అయితే, ప్రభుత్వం తాజాగా బడ్జెట్లో రాబడి అంచనాలను పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై ఆరా తీయడంతో ఈ నిర్ణయం అమలు చేయనుందని తెలుస్తోందితెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1,956 బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే మరో 604 మద్యం బ్రాండ్లు రాష్ట్రంలోకి అడుగుపెట్టేందుకు ఎదురుచూస్తున్నాయి. వీటి అనుమతి కోసం సుమారు 92 కంపెనీలు ఉండగా.. ఇందులో బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ ఛాలెంజ్, సులావైన్ వంటివి ఇక్కడ ఎక్కువగా అమ్ముడయ్యే బ్రాండ్లు ఉన్నాయి. కొత్తగా రాబోతున్న వాటిలో 15 విదేశీ బ్రాండ్లు, 15 దేశీయ లిక్కర్, 7 బీర్ బ్రాండ్లు, 37 కొత్త బ్రాండ్లు ఉన్నాయని తెలుస్తోంది.ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులకు భారీగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) పట్టుబడింది. ఆ మద్యం సీసాల్లో లోకల్ బ్రాండ్లు లేకపోవడం, విదేశీ బ్రాండ్ మద్యం అక్రమ తరలింపు గుర్తించారు. ఈ ఎన్డీపీఎల్లో అత్యధికశాతం మన దగ్గర అందుబాటులో లేని జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు ఉంటున్నాయని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న బ్రాండ్లకు అనుమతి లభిస్తే ఈ ఎన్టీపీఎల్ సమస్య తగ్గుతుందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. కొత్తవాటికి అనుమతిస్తే.. ఒక్కో బ్రాండు రూ.15 వేల చొప్పున అనుమతి ఫీజును వసూలు చేయనున్నారు. తద్వారా రూ.90,45,000లు ప్రభుత్వానికి రాబడి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని వివాదాస్పద మద్యం కంపెనీలకు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమైంది. అప్పటికే సదరు కంపెనీల నేపథ్యం వివాదాస్పదంగా ఉండటం, కొన్నిచోట్ల అవి కల్తీ మద్యం విక్రయించాయని తేలడంతో ప్రభుత్వం వాటితో ఒప్పందాలు రద్దు చేసుకున్నది. ఈ క్రమంలో అప్రమత్తమైన ఎక్సైజ్శాఖ వివాదాస్పద కంపెనీలను పక్కనపెట్టిన విషయం తెలిసిందే.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అయిపోయాక.. కొత్త బ్రాండ్లకు గేట్లు తెరవాలని సర్కార్ ప్లాన్ చేస్తోంది. అంటే.. మార్చి లేదా ఏప్రిల్‌లో కొత్త మద్యం బ్రాండ్లు క్యూ కట్టే ఛాన్స్ ఉంది. ఇక అప్పుడు చూడాలి.. మందుబాబుల ఆనందం? మామూలుగా ఉండదు.

# స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11

తెలంగాణలో కొత్తగా 12 లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రణాళికలు రచిస్తోంది. రోడ్డు, రైలు, విమాన మార్గాలతో వీటిని కనెక్ట్ చేయనున్నారు. ఈ మేరకు సర్కార్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో డ్రై పోర్టులు, గిడ్డంగులుగా ఏర్పాటు చేసి స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నారు.తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రేవంత్ సర్కార్ 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా.. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రధాన లాజిస్టిక్ హబ్‌గా మార్చే దిశగా భారీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా.. తెలంగాణ లాజిస్టిక్ పాలసీ 2.0 సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో.. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 12 కొత్త లాజిస్టిక్ పార్కులు , అవసరమైన చోట్ల డ్రై పోర్టులు, అత్యాధునిక గిడ్డంగులను నిర్మించేందుకు రెడీ అవుతున్నారు.ప్రధానంగా పరిశ్రమలను ఆకర్షించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, రవాణా ఖర్చులను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. రోడ్డు, ట్రైన్, విమాన విమాన మార్గాలను కనెక్ట్ చేస్తూ ఒక పకడ్బందీ సరఫరా వ్యవస్థను నిర్మించనున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలకు, పారిశ్రామిక క్లస్టర్లకు, ఈ-కామర్స్ సంస్థలకు ఈ మాస్టర్‌ప్లాన్ బ్యాక్‌బోన్‌గా నిలవనుంది. పర్యావరణహిత విధానాలు, ఆటోమేషన్ ద్వారా లాజిస్టిక్ రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే మనోహరాబాద్ సమీపంలో మెగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే హైదరాబాద్ శివారులోని మంగళపల్లి, బాటసింగారం తరహాలో మరిన్ని పార్కులను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ' (ప్యూర్) జోన్‌గా ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈ క్లస్టర్లు, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయటం ద్వారా గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను వేగంగా కనెక్ట్ చేయనున్నారు. దీనివల్ల భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా.. సరుకు రవాణాకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాగే, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకు ప్రతిపాదించిన 297 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే లైన్, ఈ డ్రై పోర్టులను కనెక్ట్ చేస్తూ రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించనున్నారు.ఎయిర్ కార్గో రంగాన్ని కూడా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ వంటి విలువైన సరుకు రవాణాలో దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఉంది. ఈ ఎయిర్ కార్గో సేవలను రోడ్డు, రైలు మార్గాలతో సమన్వయం చేయడం ద్వారా 'మల్టీ-మోడల్ కనెక్టివిటీ'ని సాధించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సమగ్ర లాజిస్టిక్ విధానం అమల్లోకి వస్తే.. తెలంగాణ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవటం ఖాయం.

# పోర్టు రాకతో మచిలీపట్టణానికి మహర్ధశ

విజయవాడ, ఫిబ్రవరి 11,

మచిలీపట్నం రూపురేఖలు మారబోతున్నాయి. అక్కడ కొత్తగా షిప్ బిల్డింగ్, రిపేర్ల కోసం సెంటర్ ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం మారిటైమ్ బోర్డుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మచిలీపట్నంలో షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం పలు సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అనుకున్నట్లుగానే మచిలీపట్నం వాసుల కల నెరవేరనుందని జనసేన పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం పోర్టు పనుల్ని కేంద్రం సహకారంతో మరింత వేగవంతం చేసింది. తాజాగా మచిలీపట్నంలో నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), మరమ్మతుల కోసం కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మారిటైం బోర్డు సీఈవో ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ మారిటైం బోర్డు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రాన్ని డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేయనున్నారు.మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ ప్రతిపాదించిందట. 200 ఎకరాలలో, సుమారు రూ.1,500 కోట్లతో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతోందట. ఈ మేరకు భూమిని కేటాయించాలని కూడా కోరింది. అయితే రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతోందట. త్వరలోనే దీనిపై కూడా క్లారిటీ



వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు రూ.4,735.18 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. మచిలీపట్నం పోర్టులో 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించారు. 'మచిలీపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మత్తుల సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం బందరు అభివృద్ధికి కొత్త అధ్యాయం. పోర్ట్ రూపురేఖలు మారి, ఉపాధి అవకాశాలు విస్తరించే చారిత్రాత్మక నిర్ణయం. ఈ అంశానికి సంబంధించిన జివోను జారీ చేసి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి నా కృతజ్ఞతలు' అంటూ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# ఒంగోలు నగర పాలక కౌన్సిల్ భేటి

# హాజరైన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు ఫిబ్రవరి 11

ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది.నగరపాలక సంస్థ ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తో పాటు అధికార టీడీపీ, మిత్రపక్షం జనసేన, ప్రతిపక్ష వైసిపి పార్టీకి చెందిన కార్పొరేటర్లు పాల్గొన్నారు.సమావేశానికి అవసరమైన కోరం సభ్యులు ఉండడంతో 130 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ నందు ప్రవేశ పెట్టారు.అజెండా లో ఒక అంశం మినహా అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.అజెండా లోని ప్రధాన అంశాలు అయిన ట్రంక్ రోడ్ విస్తరణ అంశం 3 తో పాటు మస్తాన్ దర్గా నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు గల రోడ్డు విస్తరణ పనులకు సంబందించిన అంశం 107 లకు సభ ఆమోదం తెలిపింది.పలు అంశాలకు చెందిన విషయాలపైన వైసిపి కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ కు టీడీపీ కార్పోరేటర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.నక్ష కార్యక్రమంలో పేరుతో ఇంటింటికి నంబర్ల వేసే కార్యక్రమానికి 20 లక్షల పనికి 80 లక్షలు కేటాయించడం ఏమిటని వైసీపీ సభ్యులు తమ అభ్యంతరాన్ని లేవనెత్తగా టీడీపీ కార్పొరేటర్లు దీటుగా బదులిచ్చారు.రైల్వే అండర్ పాస్ పనులు జరుగుతున్న నేపథ్యంలో 16వ డివిజన్ ప్రజలకు త్రాగునీరు సరఫరా విషయంలో కొత్త ఇబ్బంది ఏర్పడుతుందని పార్టీలకు అతీతంగా త్రాగునీరు సరఫరా చేయాలని వైసీపీ కార్పొరేటర్ మాట్లాడాన్ని టీడీపీ కౌన్సిల్ సభ్యులు ఖండించారు.త్రాగునీటి సరఫరా విషయంలో పార్టీలు ఉండవు. అని ఆది ప్రజా అవసరం అన్న విషయాన్ని వైసీపీ సభ్యులు గుర్తుఎరుగాలని హెచ్చరించారు. పాత మార్కెట్ నందు పీపీపీ విధానంతో చేపట్టే అభివృద్ధి పనులను వాయిదా వేసారు.

# ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

## ప్రపంచంలోనే మేటి నగరాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి ప్రణాళికలు

## 2047 కల్లా త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యం

### మధిర లో ఓటు వేసిన అనంతరం మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

మధిర ఫిబ్రవరి 11

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజాస్వామ్య పండుగ లో విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర పట్టణంలోని తొమ్మిదవ వార్డులో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు.



ప్రపంచీకరణ తరువాత గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయి ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని తెలిపారు. 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిదెందుకు ఇఃబీతీవ ప్యూర్, రేర్ కోర్ అర్బన్, ఫెరి అర్బన్, రూరల్ అగ్రికల్చర్ ఎకానమీ విభాగాలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతున్నామని తెలిపారు.

మిశ్రమలు విద్య వైద్యం మౌలిక వసతుల మేలు కలయిక ఈ ప్రణాళికలో ఉంటుందని తెలిపారు.

ఎయిర్ ఇండెక్స్ సూచిక 250 దాటుతుంది ఢిల్లీ కలకత్తా వంటి నగరాల్లో నివసించడమే కష్టం అవుతుంది ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గాలి నాణ్యతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్లలో ఆదాయం కోల్పోతున్నప్పటికీ బ్యాటరీ వివాహనాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో మురుగునీటిని శుభ్రం చేసేందుకు పెద్ద సంఖ్యలో ఎస్టిపిలను నిర్మాణం చేస్తున్నామన్నారు. చెరువుల ను ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించి పార్కులు, చెరువులను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

ఉత్పత్తికి ప్రధానమైన విద్యుత్తు సరఫరాలో రెప్పపాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, పేద కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు ?200 యూనిట్ల వరకు విద్యుత్తు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మా ప్రభుత్వం వచ్చాక 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆన్లైన్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు అంబేద్కర్ నాలెడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో దేశంలోని ప్రముఖ లెక్చరర్ల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని అన్నారు.

స్కిల్స్ ఉంటేనే ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభిస్తాయి అందుకే నియోజకవర్గ కేంద్రాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు నెలకొల్పామని తెలిపారు. పేద బిడ్డలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో నిర్మిస్తున్నామని అన్నారు . నిన్ను లేని పేదలకు 5 లక్షల రూపాయలతో ఇంద్రమా ఇల్లు నిర్మిస్తున్నామని తెలిపారు.


# రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం...

## రేవంత్ రెడ్డి సర్కార్ కు బ్రహ్మరథం.

### ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు.

కమాన్ పూర్ ఫిబ్రవరి 11

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం ఉదయం కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రామగుండం, కరీంనగర్, కార్పొరేషన్లను పూర్తిస్థాయిలో కాంగ్రెస్ కార్పొరేటర్ గెల్పొంది ఆయా రెండు పీఠాలను హస్తగతం చేసుకుంటామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మంథని పెద్దపల్లి అలాగే కరీంనగర్ జిల్లాలోని మొత్తం మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది అని అన్నారు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓటు వేశారని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ హవా కొనసాగుతోందని పేర్కొన్నారు. అన్ని స్థానాల్లో స్థానాల్లో భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన లో ప్రజలు ఆనందంగా ఉన్నారని అలాగే మా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అయిందని అన్నారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.



నేడు తెలంగాణలోని ప్రతి ఒక్కరి కళ్ళలో కాంగ్రెస్ పాలనలో ఆనందం వెల్లివిరుస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, పేరా పల్లి సర్పంచ్ బొంగుని సదయ్య గౌడ్, గుండారం ఉపసర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు సది, గరిగంటి కృష్ణ,బొడ్డు రవి, పిడుగు కవిత, రాచకొండ రజిత, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు , ఆడువాలా చంద్రయ్య తోపాటు నాయకులు పిడుగు శంకర్, మతిన్ ఖాన్ ఇక్బాల్, లల్లు, వడ్లకొండ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# చొప్పకట్లపాలెం గ్రామపంచాయతీలో సర్పంచ్ భర్త ఇష్టారాజ్యం

## పాలకవర్గాన్ని తెలియకుండానే నర్సరీలో చెట్ల నరికివేత

## నర్సరీలో పనికి వెళ్లిన వారు సేద తీరే ఎన్నో ఏళ్లుగా ఉన్న వేప, చింత చెట్లను తొలగింపు



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామపంచాయతీలో నర్సరీలోని వేప, చింత చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా, పంచాయతీ పాలకవర్గానికి తెలియకుండా సర్పంచ్ భర్త వాటిని బుధవారం తొలగించడం విమర్శలకు తావిస్తుంది. గత పది సంవత్సరాల క్రితం అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని అప్పటి పాలకవర్గం గుర్తించి అట్టి భూమిని స్వాధీనపరచుకొని పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వానికి ఆ భూమిని అప్పగించింది. అట్టి భూమిలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసింది. నర్సరీలో మొక్కలు సాగు చేయటానికి వాటి పోషణ నిమిత్తం వెళ్లిన కూలీలు ఈ చెట్ల కిందనే సేద తీరేవారు. ఫారెస్ట్ చట్టం ప్రకారం చింత చెట్లను తొలగించడానికి వీల్లేదు. ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి పచ్చదనం పెంపు కొరకు గ్రామాల్లో మొక్కలు నాటుతుంది. అంతేకాక పంచాయతీరాజ్ చట్ట ప్రకారం, ప్రభుత్వ నిబంధనల ఇంట్లో, పొలంలో చెట్లను తొలగించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలి. ఇవేమీ లేకుండా నిబంధనలన్నీ తుంగలో తొక్కుతూ నూతన పాలకవర్గం ఏర్పాటైనప్పటినుండి సర్పంచ్ భర్త కాటేపల్లి శేఖర్ ఇష్టా రీతిగా వ్యవహరిస్తున్నాడు. ఇదే క్రమంలో పంచాయతీ పాలకవర్గానికి తెలియకుండా రెండు చెట్లను అమ్మేశాడు. అంతేకాక గ్రామపంచాయతీ పాలకవర్గంలో తల దురుస్తూ మల్టీపర్పస్ వర్కర్లను, గ్రామపంచాయతీ వర్కర్లపై అజమాయిషి చేస్తున్నాడని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి చెట్లు నరికేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి :జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11 (భారత శక్తి) నిర్మల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని, మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లాలో సగటున 42 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.బుధవారం భైంసాలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడి కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటు వేయడానికి వచ్చిన వారిని అభినందించారు. పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో పోలింగ్ ఉత్సాహంగా కొనసాగుతోందని తెలిపారు. భైంసా మున్సిపాలిటీలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు 43 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. భైంసాలో ఏర్పాటు చేసిన గ్రీన్ పోలింగ్ స్టేషన్‌ను కలెక్టర్ ప్రశంసించారు. పర్యావరణ హితంగా, ఆకర్షణీయంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యార్థం హెల్ప్‌డెస్కులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు వెతికే విషయంలో ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌డెస్క్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నందున అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ తనిఖీలలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఎన్నికల అధికారులు, నిర్మల్ జిల్లా డి పి ఆర్ ఓ విష్ణువర్ధన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజుల తండాలో దేశీదారు అమ్మకందారిపై కేసు -115 దేశీదారు బాటిళ్లు స్వాధీనం

ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 11 (భారత శక్తి )

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రాజుల తండా గ్రామంలో ఎక్సైజ్ అధికారులు శనివారం నిర్వహించిన సోదాల్లో అక్రమంగా దేశీదారు మద్యం అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన సబుల్ విఘ్నాన్ సింగ్ (వా/శీ రథన్ సింగ్) అనే వ్యక్తి దేశీదారు మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

ఆయన వద్ద నుంచి మొత్తం 115 (90 ఎంఎల్) దేశీదారు బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు.

ఈ దాడుల్లో ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాస్, ఎక్సైజ్ సిబ్బంది కార్తీక్, మొహమ్మద్, అరుణ, మంజుల పాల్గొన్నారు. అక్రమంగా గంజాయి, బెల్లం, పటిక, దేశీదారు, గుడుంబా



కలిగి ఉన్నా, అమ్మినా లేదా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

# పట్టుదల ఫలితం ఖమ్మం కి చెందిన అర్వపల్లి అఖిల నాగ రమ్య సి ఎం ఏ లో ఘన విజయం

ఖమ్మం బ్యూరో, భారత శక్తి ఫిబ్రవరి 11: ఖమ్మం నగరానికి చెందిన అర్వపల్లి అఖిల నాగ రమ్య గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్‌లో సిఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంటెంట్) కోర్సును పూర్తి స్థాయిలో విజయవంతంగా ఉత్తీర్ణతతో సాధించారు. నిరంతర శ్రమ, క్రమశిక్షణతో కూడిన చదువు ఆమెను ఈ ఉన్నత విజయానికి చేర్చిందని ఉపాధ్యాయులు ప్రశంసించారు. అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్ళ గూడెం లోని మాంటిస్సోరి హైస్కూల్ లో విద్యనభ్యసించి, టెన్త్‌లో 9.5 జి.పి.ఎ సాధించారు. సాహితి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌లలో కాలేజ్ టాపర్‌గా నిలిచి తన ప్రతిభను చాటుకున్నారు. ఆమె తల్లిదండ్రులు అర్వపల్లి నాగేష్, శ్రీలక్ష్మి స్థానికంగా చిన్న కిరాణా వ్యాపారం నిర్వహిస్తూ కుమార్తె చదువుకు అన్ని విధాలుగా వారి సంపూర్ణ సహకారం అందించారు. చెల్లెలు యువ నాగశ్రీ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్థానికులు, అలాగే ఆమె చిన్ననాటి స్నేహితురాలు షేక్ తబస్సుమ్ అఖిల నాగ రమ్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



# మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయి లో చేయండి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 11(భారత శక్తి):

మహా శివరాత్రి ని పురస్కరించుకొని శైవ క్షేత్రాలలో శైవ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఈ నెల 15న మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు జిల్లాలోని 16 ప్రముఖ శైవక్షేత్రాల్లో మహా శివరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై దేవాదాయ శాఖ, రెవెన్యూ,పోలీసు అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా జిల్లా లోని ప్రధానమైన శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీ ని దృష్టి లో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ముందస్తుగా చేయాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు జిల్లాలో ప్రధానంగా పెండ్లిమర్రి మండలంలోని పొలతల శ్రీ మల్లీశ్వర స్వామి దేవస్థానం, సిద్దవటం మండలం వొంతాటిపల్లిలోని శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానం, బ్రహ్మంగారిమఠం మండలంలోని కందిమల్లయ్య పల్లిలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం, శ్రీ ఈశ్వరి దేవి మఠం, ప్రొద్దుటూరు మండలంలోని శ్రీ అగస్తేశ్వర స్వామి దేవాలయం,గోపవరం మండలంలోని ఓబులం గ్రామపరిధిలో శ్రీ మల్లెం కొండేశ్వరస్వామి దేవాలయం, చాపాడు మండలం అల్లాడు పల్లిలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం, బద్వేలు మండలం లంకమల్ల గ్రామంలోని శ్రీ లంకమల్లేశ్వర స్వామి దేవాలయంల్లోని శ్రీ గుండాల ఈశ్వర స్వామి దేవాలయం,మైలవరం మండలంలోని అగస్తికోన లోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయం, జమ్మలమడుగు మండలంలోని కన్యతీర్థం నందు గల శ్రీ ఈశ్వర స్వామి దేవాలయం, వేముల మండలం నల్లచెరువుపల్లె లోని భైరవేశ్వరస్వామి ఆలయం,పులివెందుల మండలం మిట్టమల్లేశ్వర స్వామి దేవాలయం,వల్లూరు మండలం పుష్పగిరి లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం,వివన్ పల్లె మండలంలోని అనిమేల సంఘమేశ్వర స్వామి దేవస్థానం,ఖాజీపేట మండలంలోని పుల్లూరు గ్రామంలోని శ్రీ నాథగేశ్వర స్వామి దేవాలయం, రాజంపేట మండలంలోని హత్యరాల కామాక్షి ప్రితేశ్వర స్వామి దేవాలయం.. మొదలయిన 16 శైవక్షేత్రాల్లో లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారని, వారందరికీ పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీ ఎక్కువ గా ఉంటున్నందున ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ పై దృష్టి పెట్టాలన్నారు.ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో శానిటేషన్ పనులు సంబంధిత అధికారులతో సమన్వయమై పరిశుభ్రంగాఉంచుకోవాలన్నారు. త్రాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తుల రద్దీ బట్టిఆప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలను అధికంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వైద్య సేవలకు సంబంధించి వైద్య శిబిరాలు,108 అంబులెన్స్ కు అందుబాటు లో వైద్యాధికారులు,వైద్య సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయా శైవక్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న సందర్భంగా ప్రతి చోటా మహిళలకు ఇబ్బంది లేకుండా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాత్కాలిక మరుగుదొడ్ల ను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.అన్ని శైవక్షేత్రాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని,అలాగే జిల్లా స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలని డి ఆర్ ఓ ను ఆదేశించారు.అన్ని శైవక్షేత్రాలలో దేవాదాయ శాఖ అధికారులు పోలీసు వారితో సమన్వయం చేసుకొని పటిష్ఠమైన బందోబస్తు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలనన్నారు.పటిష్ట మైన బ్యారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. బందో బస్తులో భాగంగా ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు మహిళా సేవకులను కూడా ఈ సేవలో వినియోగించాలన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 11:

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం స్థానిక కృష్ణానగర్ కాలనీ లో ఏర్పాటు చేసిన వార్డు నంబర్ 14, పోలింగ్ స్టేషన్ నంబర్ 49 వద్ద ఓటు వేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్



నిర్మల్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 11: నిర్మల్ పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియం సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు.

# ముగిసిన పోలింగ్ భైంసా మున్సిపాలిటీ ఎన్నికలు

## సాయంత్రం 5 గంటల వరకు 61.63% పోలింగ్ నమోదు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11 ( భారత శక్తి) భైంసా మున్సిపాలిటీ ఎన్నికలలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం 5.00 గంటల వరకు మొత్తం 61.63 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.




అధికారిక వివరాల ప్రకారం పురుషులు 15,870 మంది, మహిళలు 15,634 మంది, ఇతరులు 01 వ్యక్తి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తం 31,505 ఓట్లు పోలయ్యాయి.

ఉదయం ప్రారంభమైన పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూల్లో నిలబడి ఓటు వేశారు. ఎక్కడా పెద్దగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు.

మిగిలిన సమయానికి పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

# ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు



మణుగూరు, ఫిబ్రవరి 11 (భారతశక్తి): మండల పరిధిలోని విజయనగరం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై మణుగూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సిఐ పాటి నాగబాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం గత ఆదివారం రాత్రి ప్రభుత్వ గిరిజన సహకార సంస్థ పెట్రోల్ బంకును ధ్వసం చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు మణుగూరు డిఎస్పీ వి రవీందర్ రెడ్డి ఆదేశాలతో ఈ ఘటనపై విచారణ జరిపి ఏ1గా పాయం దని అన్వేష్, ఏ2 గనిబోయిన సాత్విక్, ఏ3 తాటి సాగర్, ఏ4 కంటెం భాస్కర్, ఏ5 గనిబోయిన నగేష్, ఏ6 కూరం వంశీ లపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని సిఐ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రవేట్ ఆస్తులను ధ్వసం చేసిన, దౌర్జన్యానికి పాల్పడిన, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ నాగబాబు హెచ్చరించారు.

# పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11(భారతశక్తి):

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం సందర్శించారు. కొత్తగూడెం, ఇల్లందు అశ్వారావుపేటలలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళని పరిశీలించి అక్కడ విధుల్లో ఉన్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలతో పాటు ఇల్లందులో స్ట్రాంగ్ రూమ్ ల వద్ద బందోబస్తును పరిశీలించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

# పట్టణ ప్రగతికి పట్టణ సభలు ఆయువుపట్టు

తెలంగాణలో పురపాలక ఎన్నికలు ఫిబ్రవరి11న ముగిసాయి. రాష్ట్రంలోని116మున్సిపాలిటీలకు 7 మున్సిపల్ కార్పొరేషన్ల కు ఫిబ్రవరి 13 వతేదీ నాడు ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెల్లడౌతాయి. ఫిబ్రవరి 16వ తేదీ చైర్మెన్ / డిప్యూటీ చైర్మెన్/ మేయర్లు/ డిప్యూటీ మేయర్లుచేతులెత్తే పద్ధతిద్వారా ఎన్నికౌతారు. మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్స్ పాలన ముగుస్తుంది. కొత్త గా ఎన్నికైన పుర పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పుర పాలనలో ప్రజాస్వామ్య పాలన మొదలౌతుంది.

పట్టణ సమగ్ర ప్రగతికి స్థానిక స్వపరి పాలన మొదలౌతుంది.

పట్టణ ప్రగతిలో పౌర సమాజం యొక్క భాగస్వామ్యాన్ని పెంచి పాలనలో పారదర్శనికత జవాబు దారీతనం పెంపొందించడంలో

పట్టణ సభలు కీలక పాత్ర పోషిస్తాయి.

పట్టణాభివృద్ధి పట్టణసభ

తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం వార్డు/ డివిజన్/ పట్టణ అభివృద్ధి లో పట్టణ సభ( వార్డు సభ) పౌరపాలనలో అతి ముఖ్యమైన వేదికగా పనిచేస్తుంది. ప్రజల అవసరాలను సమస్యలను గుర్తించి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి వార్డు/ డివిజన్/ పట్టణ సభ / వారధిగా నిలుస్తుంది.

పట్టణ సభ (వార్డు సభ/ డివిజన్ సభ)బాధ్యతలు

వార్డు/ డివిజన్/ పట్టణ సభ వార్డు/ డివిజన్ పట్టణ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయడం .

వార్డులో/ డివిజన్లో ప్రజల స్థానిక అవసరాలను సమస్యలను గుర్తించడం. వార్డు/ డివిజన్/పట్టణ పరిధిలో ఉన్న రోడ్లు డ్రైనేజీ మురుగునీటి వ్యవస్థ నిర్వహణ వీధి దీపాల పరిస్థితి గుర్తించి వాటి పరిష్కారానికి ప్రతిపాదనలను సిద్ధం చేస్తుంది.

వార్షిక ప్రణాళికలను రూపొందించడం

వార్డు/ డివిజన్/ పట్టణ సభ వార్షిక ప్రణాళికలను రూపొందిస్తుంది.మున్సిపల్ బడ్జెట్లో వార్డుకు/ డివిజన్ కు కేటాయించవలసిన పనుల ప్రాధాన్యత నిర్ణయించడం. పనుల పురోగతి పై సమీక్ష జరపడం. నిర్ణయించిన పనులు సకాలములో పూర్తి చేయడానికి సూచనలు సలహాలు మున్సిపల్ కౌన్సిల్ కు నివేదించడం జరుగుతుంది.

పర్యావరణ రక్షణ

వార్డులో డివిజన్లో 100% ఇంటికి చెత్త సేకరణ ప్రతిరోజు క్రమబద్ధంగా జరిగేలా చూడటం.స్వచ్ఛభారత్ కొరకు ప్రయత్నం చేయడం. ప్రజల్లో పచ్చదనం పరిశుభ్రత పారిశుధ్యం పై అవగాహన కల్పించడం.

హరితహారం

పట్టణ ప్రగతిలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ పర్యవేక్షించడం వార్డులో నాటిన మొక్కల్లో 85 బతికేలా బాధ్యత వహించడం. ఇంటి ముందు నాటిన మొక్క సంరక్షణ ఇంటి యజమానులకే అప్పగించడం పట్టణ పచ్చదనంలో పౌరులు పాల్గొనే విధంగా ప్రోత్సహించడం.

పర్యవేక్షణ పారదర్శనికత

వార్డు/ డివిజన్ లో జరిగిన ప్రజా పనులు .సివిల్ పనులు రోడ్లు డ్రైనేజీలు వర్షపునీరు కాలువల పూడికతీత పబ్లిక్ ట్యాప్స్ ఏర్పాటు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాల నాణ్యత పరిశీలన వాటిని తనిఖీ చేసే అధికారం వార్డు/ డివిజన్/ పట్టణ సభలకు ఉంటుంది. వార్డులో /డివిజన్లో జరుగుతున్న సివిల్ పనులను సామాజిక తనిఖీ చేసేఅధికారాలు ఉంటాయి . పనుల్లో నాణ్యత లోపా ల గురించి మున్సిపల్ కమిషనర్ కునివేదించే అధికారం ఉంటుంది.

నిధుల బిజవాబుదారితనం

ఆర్థిక సంఘం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరైన నిధులు ?వార్డుకు/డివిజన్ కు కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చవుతున్నాయా లేదా? అని ప్రశ్నించే హక్కు వార్డు/ డివిజన్ పట్టణ/ సభకు ఉంటుంది.

లబ్ధిదారుల ఎంపిక

పట్టణంలో పేదరికం నిరుద్యోగ నిర్మూలన పథకాల కొరకు లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని గుర్తించడం పెన్షన్లు డబ్బులు రేషన్ కార్డులు ప్రభుత్వ గృహాల నిర్మాణం ( ఇందిరమ్మ ఇండ్లు) వంటి పథకాలకు సంబంధించి వార్డులోని అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించడం ఎంపిక చేయడంలో పట్టణ సభలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

సామాజిక బాధ్యతలు

వార్డు/ డివిజన్/ పట్టణం లో పన్నుల వసూలు ప్రజలందరు ఆస్తి పన్ను నీటి పన్ను సకాలములో సక్రమంగా చెల్లించే విధంగా ప్రజలను ఇంటి యజమానుకు ప్రోత్సహించడంద్వారా మునిసిపాలిటీ ఆదాయాన్ని పెంచడంలో పుట్టినరోజు ప్రధాన భూమిక పోషిస్తాయి.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం

వార్డులో /డివిజన్లో/పట్టణంలో ప్రభుత్వ అనుమతి లేని నిర్మాణాలను అడ్డుకోవడం .ప్రభుత్వ స్థలాలను పబ్లిక్ పార్కుల స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా రక్షించడం. వార్డు /డివిజన్ పరిధిలో ఉన్న కుంటలు చెరువులు ఆక్రమణ గురి కాకుండా రక్షించడం. ప్రభుత్వ భూములను స్థలాలను ఆక్రమించిన వారిని గుర్తించి అధికారులకు సమాచారం అందించడం. ప్రభుత్వ ఆస్తులనురక్షించడం



పట్టణ సభలు సామాజిక బాధ్యత

వార్డు /డివిజన్ /పట్టణ సభలు భూమి వినియోగం నియంత్రణ ప్రజారోగ్యం పారిశుధ్యం బస్ స్టాపులు ప్రజా హిత కార్యక్రమాలు పట్టణ సభల సామాజిక బాధ్యత.వార్డు/డివిజన్ పట్టణ సభలు సక్రమంగా నిర్వహించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉ ంటుంది .

పట్టణాభివృద్ధిలో పౌర భాగస్వామ్యం బిపట్టణ సభ

వార్డు/ డివిజన్/ పట్టణ సభల ద్వారానే సామాన్య పౌరుడు పట్టణాభివృద్ధిలో భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. పట్టణ సభలో కౌన్సిలర్/ కార్పొరేటర్ వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు

మహిళా సంఘాలు యువజన సంఘాలు వార్డు /డివిజన్ పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ అసోసియేషన్స్ ప్రతినిధులు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్

ప్రతినిధులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు క్రియాశీలక భాగస్వామ్యాన్ని పొంది పట్టణ ప్రగతికి పాటుపడాలి.

స్థానిక సంస్థల సాధికారితబి పట్టణ సభలు

74 వ రాజ్యాంగ సవరణ(1992) ద్వారా రాజ్యాంగంలోని 12 వ షెడ్యూల్లో పేర్కొన్న 18 రకాల మున్సిపాలిటీ విధులు నేరుగా పట్టణ ప్రాథమిక అవసరాలతో ముడివడి ఉన్నాయి. స్థానిక స్వపరిపాలన అనేది కేవలం అధికార వికేంద్రీకరణ మాత్రమే కాదు. పౌరుడికి అప్పగించిన బాధ్యత పట్టణ పౌరులందరూ పట్టణ సభలో పాల్గొందాం. పట్టణాభివృద్ధికి పాటుపడదాం

స్థానిక పాలన సాధికారితతో పట్టణాల సమగ్ర అభివృద్ధికి సుస్థిర పాలనా వ్యవస్థ బలోపేతానికి చైతన్యం కలిగిన పౌరులుగా సూక్ష్మ స్థాయి ప్రజా ప్రణాళికల రూపకల్పనలో భాగస్వాములమై మెరుగైన పట్టణ ప్రగతికి దిక్సూచిగా నిలుద్దామనిప్రతిజ్ఞ చేయాలి. చైతన్యం కలిగిన పౌరులు పట్టణ అభివృద్ధి సుందరీకరణలో క్రియాశీలకంగాపాల్గొనాలి .స్థానిక సంస్థల ప్రజాస్వామ్య పరిపుష్టికి పాటుపడుతారని ఆశిద్దాం.

నేదునూరి కనకయ్య

అధ్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరం మాజీ కరస్పాండెంట్ జస్టిస్ కుమారయ్యా

లా కాలేజ్ కరీంనగర్

(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు

చీఫ్ జస్టిస్ జస్టిస్ కుమారయ్య)

కరీంనగర్9440245771

# గీతం హ్యుమానిటీస్ డీన్ గా డాక్టర్ రతిన్ రాయ్

## -హృదయపూర్వకంగా స్వాగతించిన గీతం నాయకత్వం

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 11:



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జి.ఎస్.హెచ్.ఎస్.) డీన్ గా డాక్టన్ రతిన్ రాయ్ నియమితులయ్యారు. గీతం అనుబంధ కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి.)లో విశిష్ట ఫెలో అయిన డాక్టర్ రాయ్ ప్రపంచవ్యాప్తంగా గౌరవనీయమైన ఆర్థికవేత్త, పబ్లిక్ పాలసీ పండితుడే గాక విద్యా, పబ్లిక్ ఫైనాన్స్, అంతర్జాతీయ అభివృద్ధిలో అత్యుత్తమ నాయకత్వం వహించారు.

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్ లో డాక్టర్ రాయ్ పీహెచ్.డీ., ఎం.ఫిల్. పట్టాలను పొందారు. ప్రస్తుతం ఆయన లండన్ లోని ఓవర్సీస్ డెవలప్ మెంట్ ఇన్ స్టిట్యూట్ (ఓడీఐ గ్లోబల్)లో విజిటింగ్ సీనియర్ ఫెలోగా సేవలందిస్తున్నారు. ఆయన విశిష్ట కెరీర్ లో నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్.ఐ.పి.ఎఫ్.పి.) డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా, బ్రెజిల్ లోని యు.ఎన్.డి.పి.లోని ఇంటర్నేషనల్ పాలసీ సెంటర్ ఫర్ ఇన్ క్లూజివ్ గ్రోత్ (ఐ.పి.సి-ఐ.జి)లో డైరెక్టర్ వంటి ప్రముఖ పదవులలో రాణించారు.వీటికి అదనంగా, డాక్టర్ రాయ్ ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమంలో అనేక సీనియర్ సలహాదారు పదవులను నిర్వహించారు. భారతదేశ 13వ ఆర్థిక కమిషన్ కు ఆర్థిక సలహాదారుగా, భారత ప్రధానమంత్రికి ఆర్థిక సలహా మండలి సభ్యుడిగా జాతీయ విధానానికి డాక్టర్ రాయ్ విస్తృతంగా దోహదపడ్డారు.డాక్టర్ రాయ్ నియామకం జి.ఎస్.హెచ్.ఎస్.కు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఆయన మేధో నాయకత్వం, గొప్ప విధాన అనుభవం, ప్రపంచ దృక్పథం, విద్యా నైపుణ్యం, పరిశోధన ఆవిష్కరణ, సంస్థాగత వృద్ధిని గణనీయంగా బలోపేతం చేస్తాయని భావిస్తున్నారు.డాక్టర్ రతిన్ రాయ్ నియామకాన్ని గీతం నాయకత్వం హృదయపూర్వకంగా స్వాగతించింది. ఆయన దార్శనిక నాయకత్వం, గీతం విద్యా సమాజానికి విలువైన తోడ్పాటును అందించగలదని వారు ఆశాభావం వ్యక్తపరిచారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

**-సమస్యాత్మకంగా గుర్తించిన భైంసాలో ఒక్క అవాంఛనీయ ఘటన లేకుండా ఎన్నికల నిర్వహణ**

**-ఎన్నికల నియమావళి ఇంకా అమలులో ఉంది - ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11 (భారత శక్తి) నిర్మల్ జిల్లా పరిధిలో నిర్వహించిన నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగాయి. ఎన్నికల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ విస్తృత భద్రతా చర్యలు చేపట్టింది.

ఈ సందర్భంగా ప్రత్యేకంగా సమస్యాత్మకంగా గుర్తించిన భైంసా ప్రాంతంలోనూ ఒక్క చిన్న ఘటన కూడా జరగకుండా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మార్గదశకంలో జిల్లా పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసింది. ముందస్తు ప్రణాళిక, నిఘా వ్యవస్థ, నిరంతర పర్యవేక్షణ, ఫ్లాగ్ మార్చ్‌లు, సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాల మోహరింపు వంటి చర్యలతో ఎన్నికలు శాంతియుతంగా సాగాయి.

జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల స్వయంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించడంతో పాటు అధికారులకు తగిన మార్గదర్శకాలు అందించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, మొబైల్ పట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీమ్‌ల ఏర్పాటు ద్వారా ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియలేదు, ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కార్యక్రమం ఇంకా కొనసాగాల్సి ఉంది. అందువల్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ అఫ్ కండక్ట్) అమలులోనే ఉంటుంది.ఈ నేపథ్యంలో ఎలాంటి సంఘ విద్రోహ చర్యలకు, గందరగోళాలకు లేదా చట్ట విరుద్ధ కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వబడదు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల హెచ్చరించారు.


# సినిమా

## ఎంబీబీఎస్ పూర్తి...
## వైద్య పట్టా అందుకున్న నటి శ్రీలీల





అందాల హీరోయిన్ శ్రీలీల ఇప్పుడు అధికారికంగా డాక్టర్ అయ్యారు. సినిమాల్లో నటిస్తూనే ఆమె వైద్య విద్యను అభ్యసించారు. ఆమె ముంబైలోని డివై పాటిల్ విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య పట్టాను అందుకున్నారు. ఫిబ్రవరి 10న జరిగిన ఈ వేడుకకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అభిమానులు, పలువురు నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఒక చిత్రంలో వేదికపై మెరూన్ రంగు దుస్తులు ధరించిన శ్రీలీల స్నాతకోత్సవ వేడుకలో డిగ్రీని స్వీకరిస్తున్నట్లు ఉంది.

## 'దృశ్యం 3'లో
## కీలక పాత్రలో ప్రకాశ్ రాజ్




బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగణ్ హీరోగా అభిషేక్ పాఠక్ దర్శకత్వంలో 'దృశ్యం 3' సినిమా చిత్రీకరణ ప్రారంభమయింది. ఈ సినిమాలో ప్రకాశ్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్ రాజ్ మాట్లాడుతూ... ఇంత అద్భుతమైన ఫ్రాంచైజీలో భాగమవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ చిత్రంలో తనది ఒక ప్రత్యేకమైన పాత్ర అని తెలిపారు. మరోవైపు ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా తప్పుకున్నారు. ఆయన స్థానంలో ప్రకాశ్ రాజ్ నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే, ప్రకాశ్ రాజ్ తన పోస్ట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో తాను ప్రత్యేక పాత్రను పోషిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు ఈ చిత్ర నిర్మాత కుమార్ మంగత్ పాఠక్ స్పందిస్తూ... అక్షయ్ ఖన్నా స్థానంలో జైదీప్ అహ్లావత్ నటిస్తున్నట్టు స్పష్టం చేశారు. అక్షయ్ ఖన్నా పోషించిన తరహా పాత్రనే జైదీప్ చేస్తారని తెలిపారు. ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు, ఈ సినిమా కోసం అక్షయ్ ఖన్నాకు నిర్మాతలు అడ్వాన్స్ కూడా ఇచ్చారు. అగ్రిమెంట్ చేసుకుని, డేట్స్ కూడా ఇచ్చి అక్షయ్ కుమార్ ఈ సినిమా నుంచి తప్పుకున్నారు. నిర్మాతలు ఫోన్ చేసినా అక్షయ్ స్పందించలేదు. ఈ క్రమంలో అక్షయ్ కు నిర్మాతలు కోర్టు ద్వారా నోటీసులు కూడా పంపారు.

## ఎన్నో కష్టాలు పడ్డాను ..
## కన్నీళ్లు పెట్టుకున్న యాంకర్ స్రవంతి




బుల్లితెరపై .. ఈవెంట్స్ లోను సందడి చేసే కొంతమంది యాంకర్స్ కి హీరోయిన్స్ తో సమానమైన క్రేజ్ ఉందనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. అలాంటి అతికొద్ది మంది యాంకర్స్ లో స్రవంతి ఒకరు. స్రవంతి గ్లామర్ కీ .. ఆమె మాట తీరుకీ .. నవ్వుకి యూత్ వైపు నుంచి చాలామంది అభిమానులు ఉన్నారు. ఒక రకంగా హీరోయిన్స్ కి ఉండవలసిన లక్షణాలు ఆమెలో ఉన్నాయని భావిస్తుంటారు. అయితే ఆమె మాత్రం యాంకర్ గానే కొనసాగుతూ వెళుతున్నారు. తాజాగా 'గ్రేట్ ఆంధ్ర'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్రవంతి మాట్లాడుతూ .. "నేను హైదరాబాద్ కి వచ్చిన కొత్తలో ఒక వైపున చదువుకుంటూనే మరో వైపున డాన్స్ నేర్చుకునేదానిని. ఒకసారి నేను మా ఫ్రెండ్ తో కలిసి 'మహంకాళి' సినిమా షూటింగుకి వెళ్లాను. అక్కడ జర్నలిస్ట్ గా చేయవలసిన ఆర్టిస్ట్ రాకపోవడంతో నాతో చేయించారు. రోజుకి 3 వేల రూపాయలు ఇచ్చారు. ఇదేదో బాగుందే అనిపించింది. ఆ సమయంలోనే నేను ప్రేమలో పడ్డాను. వాళ్ల ఫ్యామిలీకి ఇష్టం లేదని తెలిసి సినిమాలు మానేశాను" అని అన్నారు.

## ఎక్కువ మాట్లాడరు




కాఫీ విత్ కరణ్ షోలో ప్రసారమైన ఓ పాత క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సీజన్ 3లో అనిల్ కపూర్, సంజయ్ దత్‌లతో కలిసి షోకు వచ్చిన కంగనాను కరణ్ జోహార్ ఓ ప్రశ్న అడిగారు. పూర్తిగా పట్టించుకోని వ్యక్తిని ఎప్పుడైనా ఫ్లర్ట్ చేశావా అన్న ప్రశ్నకు కంగనా అక్షయ్ ఖన్నా పేరు చెప్పింది. అక్షయ్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించానని కానీ ఆయన ఎలాంటి స్పందన ఇవ్వలేదని కంగనా తెలిపింది. ఆయన ఎవరికీ ఎక్కువగా మాట్లాడరని తెలిపింది. కంగనా, అక్షయ్ గతంలో నో ప్రాబ్లమ్ చిత్రంలో కలిసి నటించారు. సెట్స్‌లో అక్షయ్ ఖన్నా మౌనంగా తన పనిలో తాను ఉండే వ్యక్తిగా పేరున్న నటుడు. చిన్న మాటలకన్నా నటనపై దృష్టి పెట్టే స్వభావం ఆయన ప్రత్యేకతగా సహనటులు పలుమార్లు చెప్పారు. ప్రస్తుతం ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన స్పై థ్రిల్లర్ ధురంధర్ చిత్రంతో అక్షయ్ ఖన్నా ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ చిత్రంలో రణవీర్ సింగ్, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్ మాధవన్ తదితరులు నటించారు.

## మరో అవకాశం లేదు



హంగామా, భూల్ భూలయ్యా, డ్రీమ్ గర్ల్ 2, బేబీజాన్ తదితర హిందీ చిత్రాల్లో కమెడియన్‌గా రాణించిన బాలీవుడ్‌నటుడు రాజ్‌పాల్ యాదవ్. కిక్ 2 మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. మరాఠీ, భోజ్ పురి, పంజాబీ, బెంగాలీ చిత్రాల్లోనూ నటించాడు. నటుడితో పాటు ఆయన భార్యపై మురళీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చెక్ బౌన్స్ కేసు పెట్టిన విషయం తెలిసిందే. ఈ కేసును విచారించిన ఢిల్లీ మెజిస్ట్రేట్ కోర్టు 2018లో దంపతులద్దరినీ దోషులుగా తేల్చి నటుడుకి ఆరు నెలల జైలు శిక్ష విధించింది. మరుసటి ఏడాది సెషన్స్ కోర్టు కూడా ఈ శిక్షను సమర్థించడంతో రాజ్ పాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ముందుగా తాత్కాలిక స్టే విధించిన హై కోర్టు.. ఫిర్యాదు దారుడితో రాజీ చేసుకోవాలన సూచింది. అయితే డబ్బులు తిరిగి చెల్లించేందుకు తనకు మరింత సమయం కావాలన్న విజ్ఞప్తిని ఉన్నత న్యాయస్థానం తిరస్కరించడంతో ఆయన లొంగిపోయాడు. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఆయన తాజాగా తన ఆర్థిక ఇబ్బందుల గురించి అక్కడి జైలు అధికారులతో అభిప్రాయాన్ని పంచుకున్నాడు. తనకు లొంగిపోవడం తప్ప మరో అవకాశం లేదన్నాడు. సినీ పరిశ్రమలో ఎవరినీ సాయం అడగ కూడదు అని నిర్ణయం తీసుకున్నాడట.

# 10/10 మార్కులు






తన కూతురు ఐశ్వర్య, కన్నడ నటుడు ఉపేంద్ర సోదరుడి తనయుడు నిరంజన్ ప్రధాన పాత్రల్లో సీనియర్ హీరో అర్జున్ తెరకెక్కిస్తున్న తాజా మూవీ సీతాపయనం. ఈ నెల 14 ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో భాగంగా పాల్గొన్న ఐశ్వర్య చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. షూటింగ్ సమయంలో అర్జున్ తండ్రిగా కాకుండా దర్శకుడిగా చాలా కఠినంగా ఉన్నాడని చెప్పింది ఐశ్వర్య. షూటింగ్‌సెట్‌లో తండ్రీకూతుళ్ల ఫీలింగ్ అస్సలు ఉండదట. అవసరమైతే మాత్రం షూటింగ్‌లో ఎంత దూరంలో ఉన్నప్పటికీ పది నిమిషాల్లో తమ దగ్గరికి వస్తాడట. అందుకే డైరెక్టర్‌గా ఆయనకు 10కి 10 మార్కులు వేస్తానంది. తండ్రిగా కూడా అంతే మొత్తంలో మార్చులు ఇస్తానని వెల్లడించింది. తెలుగులోనూ మాట్లాడిన ఐశ్వర్య ఈ సినిమా అందరికీ నూటికి నూరు శాతం నచ్చుతుందని పేర్కొంది.

## సెంగోల్ కోసం భీకర యుద్ధం... అదరగొడుతున్న నిఖిల్ 'స్వయంభూ' టీజర్

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, దీనికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. టీజర్‌లోని విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. టీజర్ ప్రకారం, శ్రీరాముడికి శివుడు బహూకరించిన పవిత్రమైన సెంగోల్ (రాజదండం) చుట్టూ ఈ కథ నడుస్తుంది. కాలక్రమేణా ఆ సెంగోల్ అదృశ్యం కావడం, దాన్ని దక్కించుకోవడానికి రాజ్యాల మధ్య




భీకర యుద్ధాలు జరగడం వంటి అంశాలను చూపించారు. ధర్మాన్ని నిలబెట్టడం కోసం పోరాడే ఒక భీకర యోధుడిగా నిఖిల్ పాత్రను పరిచయం చేశారు. క్రీ.శ. 985 నాటి చారిత్రక నేపథ్యంతో, పురాణాలను జోడించి దర్శకుడు ఈ కథను ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. పొడవాటి జుట్టు, మెలితిప్పిన మీసం, గడ్డంతో ఉన్న నిఖిల్, ఒక యోధుడి పాత్రలో ఒదిగిపోయారు. నిఖిల్ చేసిన కత్తి యుద్ధాలు, పోరాట సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి. కథానాయికలు సంయుక్త, నభా నటేష్ కూడా కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, బలమైన పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా సంయుక్త విలువిద్య, కత్తిసాములో ప్రావీణ్యం ఉన్న మహిళగా కనిపించారు. ఈ పాత్ర కోసం గుర్రపుస్వారీ, విలువిద్యలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నానని, ఇది తన కెరీర్‌లో ఎంతో సంతృప్తినిచ్చిన పాత్ర అని ఆమె తెలిపారు. పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ, రవి బస్రూర్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు హిందీ, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి

**: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11 (భారత శక్తి) : ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుల్స్, అభ్యర్థుల గ్యాలరీలను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులకు, మీడియా ప్రతినిధులకు టీ, టిఫిన్, భోజనం, త్రాగునీటి వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి



అనుమతించాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జి ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు

* **జీఎన్ఆర్ చైతన్య హైస్కూల్ విద్యార్థులకు అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్స్**

ఎల్బీనగర్, ఫిబ్రవరి 11 (భారత శక్తి): చైతన్యపురి-సత్యనారాయణపురం కాలనీలోని జీఎన్ఆర్ చైతన్య హైస్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్ పరీక్షల్లో అద్భుత ప్రతిభను కనబరచి ఐదు గోల్డ్ మెడల్స్ సాధించి పాఠశాలకు గర్వకారణమయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలంటే నాణ్యమైన విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించే విధంగా బోధన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా జీఎన్ఆర్ చైతన్య హైస్కూల్‌లో సమగ్ర విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు.గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన ఆయన, ఈ విజయానికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా ప్రశంసించారు.



## శ్రీశైలం కాలినడకను బయలుదేరిన నాగర్ కర్నూల్ శివదీక్ష స్వాములు...

* **వైభవంగా ఇరుముడి పూజా కార్యక్రమం..**

నాగర్ కర్నూల్ జిల్లా (భారత శక్తి ) ఫిబ్రవరి 11 : నాగర్ కర్నూల్ కేంద్రంలోని ఎర్రగడ్డలోని సుబ్రమణ్య స్వామి దేవాలయంలో బుధవారం నాడు మల్లికార్జున సన్నిధానం శివ దీక్ష స్వాములు ఇరుముడి కార్యక్రమం వైభవంగా నిర్వహించినట్లు గురుస్వామి గుంపుల విజయకుమార్ తెలిపారు. గత మండలం రోజుల నుంచి శివదీక్ష తీసుకున్న 20 మంది శివ స్వాములు వారి కుటుంబ సభ్యులు ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సామూహికంగా భోజన కార్యక్రమాలు నిర్వహించారు. శివ దీక్ష స్వాములతో పాటు శివ భక్తులు కాలినడకన శ్రీశైలం పాదయాత్రతో వెళ్లారు. వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జివి రామకృష్ణ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేయడం జరిగింది అనంతరం మహాశివరాత్రి రోజు వరకు శ్రీశైలం చేరుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు రాంబాబు, ఆప్టికల్ చంద్రశేఖర్, తిరుపతయ్య, లోకేష్, శ్రీశైలం,మహేష్,శివ,శేఖర్ రామచందర్,గణపతి, శంకర్,రాము,శివ స్వాముల పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, , ఫిబ్రవరి 11 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ ప్రక్రియపై నిశితంగా పరిశీలన చేసిన ఆయన, కొన్ని కేంద్రాల్లో ఏర్పాట్లలో లోపాలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరగాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికార పార్టీ ప్రభావం, ఒత్తిడులు, అక్రమాలు చోటుచేసుకుంటే తీవ్రంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు.కొన్ని చోట్ల ప్రతిపక్ష కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వచ్చాయని, అలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు.కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డా.శ్రీహరి, శ్రీధర్ రెడ్డి, లాడే మల్లేశం, శ్రవణ్ రెడ్డి, మోహన్ సింగ్, లాడే బాలు తదితరులు ఉన్నారు.

## జనగణన నోటిఫికేషన్ తర్వాత కార్పొరేషన్ల ఏర్పాటు చట్టవిరుద్ధం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (భారత శక్తి): జనగణన నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నోటిఫికేషన్ ప్రకారం సరిహద్దులకు సంబంధించి మార్పులు చేర్పులు 2027 మే వరకు చేయకూడదని ఉన్నప్పటికీ.. ఈ విధంగా చేయడం చట్టవిరుద్ధమన్నారు. మరోవైపు మున్సిపల్ ఎన్నికలు జరుగుతుంటే అనేక మంది ఐఏఎస్‌లను బదిలీ చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసలు ఉందా? వాళ్లు రూపకల్పన చేసిన విధి విధానాలు అమలు చేస్తున్నారా? అనే అనుమానం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలపై భాజపా అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ ఎన్నికల కమిషన్,



పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వం జీహెచ్ఎంసీపై పెత్తనం చేస్తూ.. గ్రేటర్ పరిధిలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని ఆరోపించారు. కేరళ ఎన్నికల కోసం ఆర్ఆర్ ట్యాక్స్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడత పంపించిందని విమర్శించారు. మూసీ ప్రక్షాళన చేయాలని భాజపా కూడా కోరుకుంటోందన్నారు. మంచి పని చేస్తామంటే ఎవరూ వద్దంటారని.. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఎట్లా చేస్తారని ప్రశ్నించారు. డబ్బు, అధికార మదంతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలని ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు. ఇంత పెద్దఎత్తున అధికార దుర్వినియోగం ఎప్పుడూ జరగలేదన్నారు. ఏ పార్టీ నుంచి గెలిచినా కాంగ్రెస్ పార్టీ బలపరిచే ఛైర్మన్‌కు మద్దతు ఇవ్వాలని ఇప్పటి నుంచే బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. విజయం సాధించిన ఏ ఒక్క భాజపా అభ్యర్థికి ఏదైనా జరిగితే రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

## 90 శాతం మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌దే విజయం: మహేశ్ గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కనిపించిందని, 90 శాతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు తమ పార్టీ ఖాతాలో పడనున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. అత్యధిక స్థానాల్లో హస్తం పార్టీ ఆధిక్యం సాధించబోతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్న విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని వివరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు.. ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పీసీసీ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు.



## అడుగడుగునా కాంగ్రెస్ అధికార దుర్వినియోగం: హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు.




చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.

## నర్సింగ్ విద్యార్థులకు భారీ ఊరట.. రిజిస్ట్రేషన్‌కు ఐఎన్‌సీ సర్టిఫికెట్ అక్కర్లేదు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (భారత శక్తి): కర్ణాటకలో నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు కేరళలో ఊరట లభించింది. కేరళలో రిజిస్ట్రేషన్ పొందడానికి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్సీ) సూటబిలిటీ సర్టిఫికెట్ సమర్పించాలన్న నిబంధనను కేరళ హైకోర్టు కొట్టివేసింది. దీనివల్ల కర్ణాటకలోని గుర్తింపు పొందిన కాలేజీల్లో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వేలాది మంది విద్యార్థులకు కేరళలో నర్సులుగా సేవలందించేందుకు మార్గం సుగమమైంది. కర్ణాటక నర్సింగ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పునిచ్చింది. కర్ణాటక నర్సింగ్ కౌన్సిల్ గుర్తించిన కళాశాలల్లో చదివిన విద్యార్థులకు, ఐఎన్సీ గుర్తింపు లేదనే సాకుతో రిజిస్ట్రేషన్ నిరాకరించడం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. నర్సింగ్ విద్యా ప్రమాణాల నిర్ణయం, తనిఖీలకు మాత్రమే ఐఎన్సీ పరిమితమని, కాలేజీలకు అసలు గుర్తింపునిచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిళ్లకే ఉంటుందని కోర్టు పేర్కొంది. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కర్ణాటక) అందించే బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ, కేంద్ర చట్టమైన ఐఎన్సీ యాక్ట్ 1947 పరిధిలోకి వస్తుంది కాబట్టి ఈ డిగ్రీ




పొందిన వారు దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా రిజిస్ట్రేషన్ పొందే అర్హత కలిగి ఉంటారని తెలిపింది. కేరళ నర్సులుమిడ్‌వైవ్స్ చట్టం1953 ప్రకారం ఐఎన్సీ సర్టిఫికెట్ తప్పనిసరి అనే నిబంధన ఎక్కడా లేదని, కేరళ నర్సింగ్ కౌన్సిల్ తీసుకున్న ఈ నిర్ణయం అహేతుకమైనదని కోర్టు అభిప్రాయపడింది.

**ఉద్యోగాలకు లైన్ క్లియర్..**

కేంద్ర చట్టంలోని షెడ్యూల్‌కు అనుగుణమైన విద్యార్హతలు కలిగి ఉండి, కర్ణాటకలో గుర్తింపు పొందిన సంస్థల్లో చదివిన విద్యార్థులందరినీ కేరళలో నర్సులుగా రిజిస్టర్ చేయాలని కేరళ నర్సింగ్ అండ్ మిడ్‌వైవ్స్ కౌన్సిల్‌ను న్యాయస్థానం ఆదేశించింది. ఈ తీర్పుతో గత కొంతకాలంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు లబ్ధి చేకూరనుంది. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి నిబంధనలపై ఇప్పుడు చర్చ మొదలయ్యే అవకాశం ఉందని విద్యా రంగ నిపుణులు భావిస్తున్నారు.

# మున్సిపల్ పోరు ముగిసె.. 'హస్తం' జోరు పెరిగె..?




హైదరాబాద్, ఫిబ్రవరి 11 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పర్వం బుధవారంతో ముగిసింది. స్వల్ప సంఘటనలు మినహా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల సమయానికే పోలింగ్ ముగిసినప్పటికీ, అప్పటికే క్యూ లైన్లలో ఉన్న వారికి అధికారులు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. గడప గడపకూ ప్రచారం నిర్వహించిన ప్రధాన పార్టీల అదృష్టం ఇప్పుడు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా, అదే రోజు పట్టణ పీఠాలు ఎవరివనేది తేలిపోనుంది.

**కాంగ్రెస్ హవా.. విపక్షాలకు దెబ్బేనా?**

పోలింగ్ ముగిసిన వెంటనే వెలువడిన పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లోనూ తన ఆధిపత్యాన్ని చాటుకోనున్నట్లు అంచనాలు వెలువడ్డాయి. దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను హస్తం పార్టీ కైవసం చేసుకునే అవకాశం ఉందని ఈ సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా రామగుండం, మంచిర్యాల, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం కార్పొరేషన్లలో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోందని విశ్లేషించింది.

**బీజేపీ దూకుడు.. బీఆర్ఎస్ కు నిరాశే!**

ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ జెండా ఎగురవేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు చోట్లా కమలం పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించనుందని సర్వే పేర్కొంది. కాగా, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు కోలుకోలేని దెబ్బ తీయనున్నట్లు తెలుస్తోంది. ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా సొంతంగా గెలుచుకునే పరిస్థితి లేదని పీపుల్స్ పల్స్ తేల్చిచెప్పడం గమనార్హం.

**కింగ్ మేకర్ గా ఎంఐఎం..**

నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ వంటి కీలక కార్పొరేషన్లలో ఎంఐఎం నిర్ణయాత్మక శక్తిగా మారనుంది. మేయర్ పీఠాలను కైవసం చేసుకునే క్రమంలో ఏ పార్టీకి మెజారిటీ రాకపోయినా, ఎంఐఎం మద్దతు కీలకం కానుంది.


**గెలుపు గుర్రాలు ఎవరంటే?**

* రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలలో:
* కాంగ్రెస్: 6876 స్థానాల్లో గెలుపు ఖాయమని అంచనా.?
* బీఆర్ఎస్: 2936 స్థానాలకు పరిమితం కానుంది.
* బీజేపీ: 35 చోట్ల మాత్రమే సత్తా చాటనుంది.
* దాదాపు 814 మున్సిపాలిటీల్లో మాత్రం ప్రధాన పార్టీల మధ్య 'నువ్వానేనా' అన్నట్లుగా హోరాహోరీ పోటీ నెలకొంది.
* ఓట్ల శాతం పరంగా చూస్తే కాంగ్రెస్‌కు 36 శాతం, బీఆర్ఎస్‌కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం వచ్చే అవకాశాలున్నాయి.

కౌంటింగ్ కోసం అధికారులు ఇప్పటికే 136 కేంద్రాలను సిద్ధం చేశారు. 13న ఫలితాలు వెలువడగా, 16వ తేదీన మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రక్రియ జరగనుంది.

## ఉద్యమకారుల త్యాగాలను కించపరచవద్దు

* **హైకోర్టు వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి నేత పాండురంగా రెడ్డి అభ్యంతరం**



హైదరాబాద్: , ఫిబ్రవరి 11 (భారత శక్తి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల పట్ల గౌరవ హైకోర్టు చేసినట్లుగా వస్తున్న వ్యాఖ్యలు దురదృష్టకరమని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటి స్థలాలు, పింఛన్ల కేటాయింపు అంశంపై విచారణ సందర్భంగా.. "మీరేమైనా స్వాతంత్ర్య సమరయోధులా?" అని న్యాయస్థానం ప్రశ్నించడం వేలాది మంది ఉద్యమకారుల మనోభావాలను గాయపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

**పోరాటం ఆత్మగౌరవం కోసమే..**

1969 నుంచి 2014 వరకు సాగిన ఉద్యమం ఆధిపత్య పాలన నుంచి విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం జరిగిందని పాండురంగా రెడ్డి గుర్తుచేశారు. ఇది స్వాతంత్ర్య పోరాటంతో సమానమైనదని, ఉద్యమకారుల త్యాగాలను తక్కువ చేసి చూడటం సరికాదని అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు కేవలం ఓట్ల కోసం కాదని, అవి బాధ్యతాయుతమైన పౌరులకు ఇచ్చే భరోసా అని స్పష్టం చేశారు. ఆ హామీల అమలును కోరడం ప్రతి ఉద్యమకారుడి రాజ్యాంగబద్ధమైన హక్కని వివరించారు.

**ప్రభుత్వానిదే బాధ్యత**

ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని.. నేడు రాష్ట్ర ఖజానాకు వస్తున్న ఆదాయానికి, జరుగుతున్న అభివృద్ధికి ఉద్యమకారుల పోరాటమే మూలమని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం ఎంతమందికి ఇవ్వగలదు?" అనే కోణంలో కాకుండా, రాష్ట్రం కోసం కష్టపడిన వారి సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యతగా గుర్తించాలని కోరారు.

న్యాయస్థానాలు కేవలం చట్టాలనే కాకుండా, చారిత్రక నేపథ్యాలను, ప్రజా సెంటిమెంట్లను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మేలు చేయవని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ఆక్రమణదారుల గుండెల్లో 'హైడ్రా' వణుకు!

* **రూ. 1003 కోట్ల విలువైన భూమికి విముక్తి..**
* **జూబ్లీహిల్స్, ఖానామెట్‌లో భారీ ఆపరేషన్**
* **ప్రగతినగర్ చెరువుకు పూర్వవైభవం: 1.5 కి.మీ. మేర ఫెన్సింగ్..**
* **145 లారీల వ్యర్థాల తొలగింపు**





హైదరాబాద్ ఫిబ్రవరి 11 భారత శక్తి : నగరంలోని భూ కబ్జాదారులు, చెరువుల ఆక్రమణదారులపై హైడ్రా (HYDRAA) ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా జూబ్లీహిల్స్, ఖానామెట్ ప్రాంతాల్లో వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు, ప్రగతినగర్ చెరువు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో సుమారు రూ. 1003 కోట్ల విలువైన ఆస్తులను కబ్జాకోరల నుంచి విముక్తి కల్పించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

**రూ. 3 కోట్ల పార్కు స్థలం స్వాధీనం:**



జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి సమీపంలోని ఓ పార్కు స్థలంపై కన్నేసిన ఓ కిరాయిదారుడు, ఏకంగా 150 గజాల స్థలాన్ని ఆక్రమించాడు. అక్కడ లేడీస్ హాస్టల్ నడుపుతున్న సదరు వ్యక్తి, నిబంధనలకు విరుద్ధంగా మూడు అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టడమే కాకుండా, పార్కు వైపు గేటు పెట్టుకుని సొంత ఫామ్ హౌస్ లా మార్చుకున్నాడు. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు, అధికారులు ఆక్రమణలను కూల్చివేసి రూ. 3 కోట్ల విలువైన భూమిని స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

**ఖానామెట్‌లో వెయ్యి కోట్ల భూమికి రక్షణ**

హైటెక్స్ సమీపంలోని ఖానామెట్‌లో వెలమ సంఘానికి కేటాయించిన 5 ఎకరాల భూమిపై కోర్టు స్టే ఉండటంతో, కబ్జారాయుళ్లు దాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఎకరం రూ. 200 కోట్లు పలికే ఈ ప్రాంతంలో సుమారు రూ. 1000 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా హైడ్రా గట్టి చర్యలు తీసుకుంది. మొత్తం స్థలానికి ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది.

**ప్రగతినగర్ చెరువుకు 'హైడ్రా' ఊపిరి!**

ప్రగతినగర్ (అంబీర్) చెరువు అభివృద్ధిపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. గత కొంతకాలంగా హోటళ్లు, చికెన్, మటన్ విక్రేతలు చెరువులో యథేచ్ఛగా వ్యర్థాలను పారబోస్తుండటంతో దుర్వాసన భరించలేక స్థానికులు ఫిర్యాదు చేశారు.

* వ్యర్థాల తొలగింపు: రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది దాదాపు 145 లారీల జంతు వ్యర్థాలను, పూడికను తొలగించారు.
* భారీ ఫెన్సింగ్: చెరువు మధ్యలో ఉన్న రోడ్డు గుండా వెళ్తూ ఎవరూ చెత్త వేయకుండా ఉండేందుకు 1.5 కిలోమీటర్ల మేర 10 మీటర్ల ఎత్తులో ఫెన్సింగ్ నిర్మించారు.
* సులభతరమైన రాకపోకలు: రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడంతో ట్రాఫిక్ కష్టాలు తీరి, రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

**పూర్వ వైభవం దిశగా..**

ఒకప్పుడు వలస పక్షులకు నిలయమైన ఈ చెరువుకు ఎస్టీపీ (STP)లు ఏర్పాటు చేసి, మురుగు నీరు కలవకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. హైడ్రా తీసుకుంటున్న ఈ సాహసోపేతమైన చర్యలపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడికి దత్తాత్రేయ అభినందనలు



హైదరాబాద్, , ఫిబ్రవరి 11 (భారత శక్తి): భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సుంకరి మల్లేశంకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని రాంనగర్‌లో దత్తాత్రేయను మల్లేశం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ ఆయనను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ.. మల్లేశం సేవలను కొనియాడారు. ఐడీపీఎల్ (IDPL)లో వృత్తి జీవితాన్ని ప్రారంభించిన మల్లేశం, కార్మికుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేశారని గుర్తుచేశారు. బీఎంఎస్‌లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కార్మికోద్యమాన్ని బలోపేతం చేయడంలో ఆయన కృషి కీలకమని ప్రశంసించారు. "నేను కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే మల్లేశం పనితీరును గుర్తించి ఈపీఎఫ్ఓ (EPFO) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (CBT) సభ్యుడిగా నియమించాను. ఆ బాధ్యతను ఆయన ఇప్పటికీ సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆయన నాయకత్వంలో బీఎంఎస్ జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను" అని దత్తాత్రేయ పేర్కొన్నారు.

## మున్సిపాలిటీలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి జిల్లా , ఫిబ్రవరి 11 (భారత శక్తి): జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర లు సందర్శించి పరిశీలించారు.

* **జిల్లాలో ఉదయం నుంచే ప్రారంభమైన మున్సిపల్ ఎన్నికల పోలింగ్**

కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైందని, పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. మహిళలు, వృద్ధులు, యువత ఉత్సాహంగా పోలింగ్ లో పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, ర్యాంపులు, వీల్‌చైర్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని పోలింగ్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా కొనసాగుతోందని, పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5:00 గంటల వరకు కొనసాగనుందని, అర్హులైన ప్రతి ఓటరు తమ సమీప పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. బాన్సువాడ లో 19 వార్డులు, 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంతంగా కొనసాగుతున్నదని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ లలో వార్డులు, పోలింగ్ బూతుల వారీగా నిర్దేశిత క్రమ సంఖ్యలో బ్యాలెట్ బాక్స్ లను అమర్చాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లెక్కింపు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా , ఫిబ్రవరి 11 (భారత శక్తి): కామారెడ్డి మున్సిపాలిటీ లోని వార్డు నెంబర్ 18 లిమ్రా గార్డెన్ సమీపం లో గల ప్రైమరీ స్కూల్, , పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం పిఎస్ .నం.55 పోలింగ్ కేంద్రములో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకొని నిర్భయంగా ఓటు వేయాలని స్థానిక సుపరిపాలనలో భాగస్వాములు కావాలని అన్నారు. ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని పోలీస్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు.

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి: సీఎం చంద్రబాబు



అమరావతి, ఫిబ్రవరి 11 (భారత శక్తి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని, అప్పుడే గుజరాత్ తరహాలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో, అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. మన రాష్ట్రంలోనూ అదే జరగాలి. మరో 15 ఏళ్ల పాటు మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి రావాలి. అప్పుడే శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడగలం" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు**

ఈ సందర్భంగా శాసనసభ్యులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. "అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందరూ సభలోనే ఉండాలి. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభను నడుపుదాం" అని అన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుంది**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని చంద్రబాబు వివరించారు. "వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టామంటే దానికి కేంద్రం చేయూతే కారణం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వకపోయి ఉంటే అవి ముందుకు కదిలేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తున్నామంటే అది కేంద్రం సాయంతోనే. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేందుకు కేంద్రం తన పాలసీనే మార్చుకుంది. ఫలితంగా, మొదటిసారిగా స్టీల్ ప్లాంట్ ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలు సాధించింది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామంటే దాని వెనుక కేంద్రం అండ ఉంది. ఈ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఎమ్మెల్యే ఓన్ చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు ఎదుర్కొన్న అణచివేతను చంద్రబాబు గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను విశాఖలో హోటల్ గదికే పరిమితం చేయడం, తన అరెస్టు సమయంలో ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. అలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఐక్యంగా నిలబడి గెలిచామని, ఈ స్ఫూర్తిని ఎప్పటికీ మరువకూడదని హితవు పలికారు.

*** కూటమి ధర్మానికి కట్టుబడి ఉందాం: పవన్ కల్యాణ్**

ముఖ్యమంత్రి అభిప్రాయంతో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తిగా ఏకీభవించారు. గత 20 నెలలుగా ఐక్యంగా పనిచేసి, వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ప్రగతి బాట పట్టిస్తున్నామని అన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుంది. ఐక్యంగా ముందుకు వెళ్తుంది. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ అవసరం. పార్టీల మధ్య ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే, వాటిని అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## అసెంబ్లీలో పవన్ కల్యాణ్ ఛాంబర్ కు వెళ్లి కలిసిన నారా లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 11 (భారత శక్తి): ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. అనంతరం సభ రేపటికి వాయిదా పడింది. బీఏసీ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల అజెండాను ఖరారు చేయనున్నారు. దీని తర్వాత ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశం జరగనుంది. మరోవైపు, అసెంబ్లీలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఛాంబర్ కు మంత్రి నారా లోకేశ్ వెళ్లారు. తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. బడ్జెట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై వీరు చర్చించారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు... పోలింగ్ శాతం ఎంతంటే...!

తెలంగాణ, ఫిబ్రవరి 11 (భారత శక్తి): తెలంగాణలో పురపాలక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో బుధవారం జరిగిన ఈ ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.03 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే, ఏడు కార్పొరేషన్ల పరిధిలో 66.05 శాతం పోలింగ్ నమోదు కాగా, 116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం ఓటింగ్ జరిగింది. అత్యధికంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో 91.91 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. అదే సమయంలో, అత్యల్పంగా నందికొండ మున్సిపాలిటీలో 59.68 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అయితే, క్యూ లైన్లలో నిల్చున్న వారికి రాత్రి 7 గంటల వరకు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కొన్ని చోట్ల స్వల్ప ఘర్షణలు మినహా, పోలింగ్ ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో సాగింది. వృద్ధులు, వికలాంగులకు పోలీసులు సహాయం అందించి ఓటు వేయించారు. పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేశారని డీజీపీ శివధర్ రెడ్డి ప్రశంసించారు. ఈ ఎన్నికల్లో 52 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక, ఫిబ్రవరి 16న వారి ప్రమాణ స్వీకారం ఉంటాయి.

## ఏపీలో ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్

అమరావతి, ఫిబ్రవరి 11 (భారత శక్తి): ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, అర్హులైన 7,514 మందికి త్వరితగతిన పదోన్నతులు కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సచివాలయంలో నిన్న రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి ఆర్టీసీ, రవాణా శాఖలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మంత్రికి వివరాలు వెల్లడించారు. 202526 డీపీసీ కింద అర్హులైన ఉద్యోగుల ఎంప్యానల్‌ను ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీలో 44,131 మంది ఉద్యోగులే ఉన్నారని, వచ్చే మూడేళ్లలో 6,891 మంది పదవీ విరమణ చేయనున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో 7,673 ఖాళీల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అలాగే మెడికల్ అన్‌ఫిట్ అయిన 682 మంది ఉద్యోగుల్లో 36 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు, మరో 646 మందికి ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఏపీలో తిరిగే బస్సులకు సంబంధించిన అఖిలభారత టూరిస్ట్ పర్మిట్ పన్నులపై ట్రావెల్స్ బస్సుల సంఘాలతో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుందామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పన్ను తగ్గిస్తే ఆయా బస్సులు ఏపీలోనే రిజిస్ట్రేషన్ అవుతాయని రవాణా అధికారులు మంత్రికి వివరించారు. డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల కోసం జారీ చేసే స్మార్ట్ కార్డుల టెండర్ నిబంధనలు త్వరగా ఖరారు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్ (వీఎల్‌టీ) ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నందున, అందుకు సంబంధించిన ఆర్ఎఫ్‌పీ (ఆర్ఎఫ్‌పీ)ను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, ఆర్టీసీ ఈడీలు బ్రహ్మానందరెడ్డి, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ లో ఓటేసిన సీఎం.. మధిరలో డిప్యూటీ సీఎం



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (భారత శక్తి): తెలంగాణలోని 116 మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. కాసేపట్లో ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని ఢిల్లీకి వెళతారని సమాచారం. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కరీంనగర్ జ్యోతి నగర్‌లోని ఎస్సార్ హై స్కూల్ కేంద్రంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

## శివరాత్రి నేపథ్యంలో... ఏపీలోని శైవక్షేత్రాలపై సీఎం చంద్రబాబు సమీక్ష





అమరావతి, ఫిబ్రవరి 11 (భారత శక్తి): శివరాత్రి సందర్భంగా ఏపీలోని శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతుల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, తీసుకుంటున్న చర్యలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో నిన్న సీఎం ఢిల్లీ నుంచే సమీక్ష చేశారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. శివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంలో శ్రీశైలంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్న సీఎం.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి అనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా, అవసరమైన వసతి సదుపాయాలు అందేలా కార్యాచరణ అమలు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి వచ్చే భక్తులను ఎవ్వరూ అగౌరవంగా చూడకూడదని స్పష్టం చేశారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. శివరాత్రి వంటి పర్వదినాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు సీఎం చంద్రబాబు కీలక

## నరవణె పుస్తకం బయటకు ఎలా వచ్చింది? పెంగ్విన్ సంస్థకు ఢిల్లీ పోలీసుల నోటీసులు

ఢిల్లీ, ఫిబ్రవరి 11 (భారత శక్తి): ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థ 'పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా'కు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంకు సంబంధించి రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ పుస్తకం ప్రచురణ కానప్పటికీ రాహుల్ గాంధీ చేతికి ఈ కాపీ ఎలా చేరుకుందని ఇండియా టుడే డిజిటల్ మీడియాలో కథనం వచ్చింది. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పుస్తకం లీక్ అయినట్లు పేర్కొంటూ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. ఇంకా ప్రచురితం కాని ఆ పుస్తకానికి సంబంధించి పలు ప్రశ్నలను పోలీసులు సంధించారు. వాటికి పెంగ్విన్ నుండి సమాధానం అడిగారు. ప్రచురణ సంస్థ యాజమాన్యం విచారణలో భాగం కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతి పొందకముందే నరవణె రాసిన ఈ పుస్తకం బయటకు రావడం వివాదంగా మారింది. పుస్తకం ప్రచురితం కాలేదని, మార్కెట్‌లో అందుబాటులో లేదని ప్రచురణ సంస్థ 24 గంటల్లో రెండుసార్లు వివరణ ఇచ్చింది. కానీ లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాత్రం ఆ పుస్తకం మార్కెట్‌లో లభ్యమవుతుందని అన్నారు.

## భారత్‌అమెరికా డీల్‌పై మాట మార్చిన వైట్‌హౌస్.. ఫ్యాక్ట్‌షీట్‌లో కీలక సవరణలు



ఢిల్లీ, ఫిబ్రవరి 11 (భారత శక్తి): భారత్‌అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్‌షీట్‌లో వైట్‌హౌస్ నిశ్శబ్దంగా కీలక మార్పులు చేసింది. ఒప్పంద వివరాలు వెల్లడించిన కొన్ని రోజులకే ఈ సవరణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా, భారత్ కొనుగోళ్లకు సంబంధించిన పదజాలాన్ని మార్చడంతో పాటు, కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు, డిజిటల్ పన్నుల ప్రస్తావనను తొలగించింది. తొలుత విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌లో, అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు భారత్ "నిబద్ధతతో ఉంది" (com mitted to buy) అని పేర్కొన్నారు. అయితే, సవరించిన వెర్షన్‌లో ఈ పదాన్ని "కొనుగోలు చేయాలని భావిస్తోంది" (intends to buy) అని మార్చారు. ఒప్పందంపై భారత్ వైపు నుంచి ఉన్న కట్టుబాటు తీవ్రతను ఈ మార్పు తగ్గించేలా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో పాటు, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గిస్తుందన్న జాబితా నుంచి "కొన్ని రకాల పప్పుధాన్యాలు" అనే పదాన్ని తొలగించారు. ఇది భారత రైతులకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో ఈ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది. అదేవిధంగా, భారత్ తన డిజిటల్ సేవల పన్నును తొలగిస్తుందన్న వాక్యాన్ని కూడా ఫ్యాక్ట్‌షీట్ నుంచి పూర్తిగా తొలగించడం గమనార్హం. ఈ మార్పులను వైట్‌హౌస్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఎలాంటి ప్రకటన లేకుండా చేసింది. ఈ సవరణలకు గల కారణాలపై అమెరికా ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక వివరణ రాలేదు. దీంతో ఒప్పందంలోని అంశాలపై ఇరు దేశాల మధ్య అవగాహన విషయంలో స్పష్టత లోపించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.




# మహా' నగరానికి మూడు ముఖాలు!

**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, డిసెంబర్ 05 (భారత శక్తి ) :**

హైదరాబాద్,ఫిబ్రవరి 11 (భారత శక్తి): భాగ్యనగర పాలనలో సరికొత్త అధ్యాయం మొదలైంది. విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దశాబ్దాల చరిత్ర కలిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ను మూడు భాగాలుగా విభజిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై నగర పాలనలో జీహెచ్ఎంసీతో పాటు, ఐటీ హబ్ కేంద్రంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, శివారు ప్రాంతాల మేళవింపుతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కొలువుదీరాయి. ఈ వికేంద్రీకరణ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.

**వికేంద్రీకరణ వెనుక భారీ కసరత్తు**

నగర జనాభా పెరుగుదల, మౌలిక సదుపాయాల కల్పనలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపడుతూ మెట్రోపాలిటన్ ఏరియా & అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జి.ఓ.ఎంఎస్. నెం.55ను విడుదల చేసింది.

* డివిజన్ల పెంపు: గతంలో ఉన్న 150 డివిజన్లు డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా 243కి పెరిగాయి. వీటికి తోడు కొత్తగా విలీనమైన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల నుంచి మరో 57 డివిజన్లను కలిపి మొత్తం 300 డివిజన్లతో ఈ మూడు కార్పొరేషన్లు పనిచేయనున్నాయి.
* జీహెచ్ఎంసీ పరిధి: ప్రస్తుతం 689 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులతో జీహెచ్ఎంసీ తన ఉనికిని చాటుకోనుంది.

**సారథులు వీరే..**

నూతన కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు వాటికి సమర్థులైన అధికారులను కమిషనర్లుగా ప్రభుత్వం నియమించింది:

* జీహెచ్ఎంసీ: కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. (అనంతరం ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు).
* సైబరాబాద్ (CMC): కమిషనర్‌గా జి. సృజన నియమితులయ్యారు.
* మల్కాజిగిరి (MMC): కమిషనర్‌గా టి. వినయ్ కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.

ఈ మూడు సంస్థల మధ్య సమన్వయం కోసం, విభజన ప్రక్రియ సజావుగా సాగేందుకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌కు ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఆయన బుధవారమే విధుల్లో చేరి పునర్వ్యవస్థీకరణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

**ప్రయోజనాలేమిటి?**

త్వరితగతిన సమస్యల పరిష్కారం: పాలనా విభాగాలు చిన్నవిగా మారడం వల్ల రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి పౌర సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించవచ్చు.

* ఐటీ హబ్‌కు ఊతం: సైబరాబాద్ కార్పొరేషన్ ఏర్పాటుతో గ్లోబల్ ఐటీ కంపెనీలకు అవసరమైన అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పన సులువవుతుంది.
* నిధుల వినియోగం: ప్రతి కార్పొరేషన్‌కు స్వయంప్రతిపత్తి ఉండటం వల్ల బడ్జెట్ కేటాయింపులు, నిధుల వినియోగంలో పారదర్శకత పెరుగుతుంది.
* చారిత్రక చట్రం: జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 3(1) ద్వారా లభించిన అధికారాలతో ప్రభుత్వం ఈ భౌగోళిక మార్పులను చేపట్టింది. సుమారు కోటిన్నర జనాభా దాటిన మహానగరానికి ఈ 'త్రిముఖ' వ్యూహం భవిష్యత్తులో వరంగా మారనుంది.








# శ్రీశైలం వెళుతున్న శివ స్వాములకు\మంగనూర్ యువత

* **అన్న ప్రసాద,అల్పాహారం పంపిణీ....**
* **నేటితో ముగిసిన అన్న ప్రసాద పంపిణీ....**

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11 (భారత శక్తి): నాగర్ కర్నూల్ నియోజకవర్గం బిజినపల్లి మండల పరిధిలోని మంగనూరు గ్రామంలో మంగనూర్ యువత శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కాలినడకన వెళ్తున్న శివ స్వాములకు మరియు శివ భక్తులకు గ్రామ కే.ఎల్.ఐ కాల్వ పక్కన హనుమాన్ దేవాలయం ఆవరణలో గ్రామానికి గత ఐదు రోజులుగా అన్నప్రసాద పంపిణీ చేస్తున్నారు. బుధ వారం నాడు మంగనూరు గ్రామానికి చెందిన శివదీక్షపరుడు పుట్ట బాలరాజ్ మాధవి దంపతులు,పిట్టల భీమయ్య మనెమ్మ దంపతులు బుధవారం నాడు ఉదయ సమయంలో 550 మందికి ఉగ్గాని అల్పాహారంను, అనంతరం మధ్యాహ్న సమయంలో 1250 మంది శివ స్వాములకు అన్నప్రసాద పంపిణీ చేశారు. మంగనూరు యువత నాయకుడు షాగల అశోక్ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న



అన్న ప్రసాద పంపిణీ నేటితో ముంచినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామస్తులకు దాతలకు పరమ శివుడు యొక్క కృపా కటాక్షాలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువత షాగల యాదయ్య,కురుమూర్తి, నిరంజన్,మావిళ్ళ శివ, కుమ్మరి తిరుమల్, 2023-24 మంగనూరు పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు,వివిధ ప్రాంతాల నుండి శ్రీశైలం చేరుతున్న స్వాములు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకతాయిల ఆటకట్టిస్తున్న 'షీ' టీమ్స్

**: మల్కాజిగిరిలో ముమ్మర నిఘా!**

* **సెల్ ఫోన్ సైకోల నుంచి బస్సు డ్రైవర్ల వరకు.. ఎవరినీ వదలని పోలీసులు**
* **15 రోజుల్లో 81 మంది వెధవ వేషాలు రట్టు; 99 ఫిర్యాదుల వెల్లువ**
* **భద్రతకు భరోసా.. ఆపదలో ఉంటే 87126 62111 కి వాట్సాప్ చేయండి**




హైదరాబాద్, ఫిబ్రవరి 11 (భారత శక్తి): మహిళల భద్రతకు తాము 'ఉక్కు కవచం' అని మల్కాజిగిరి కమిషనరేట్ షీ టీమ్స్ మరోసారి నిరూపించాయి. రోడ్లపై తిరిగే పోకిరీలనే కాదు.. డిజిటల్ తెర వెనుక దాక్కుని వేధించే 'కీచకుల' గుట్టును రట్టు చేస్తున్నాయి. తాజాగా డీసీపీ (ఉమెన్ సేఫ్టీ) టి. ఉషారాణి విడుదల చేసిన గణాంకాలు చూస్తుంటే, నగరంలో మహిళల రక్షణ కోసం పోలీసులు ఎంతటి పకడ్బందీ నిఘా ఏర్పాటు చేశారో అర్థమవుతోంది.

**ఖైదీలుగా మారిన కీచకులు:**

గడిచిన 15 రోజుల్లో (జనవరి 1631) షీ టీమ్స్ నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్లలో 81 మంది కీచకులు చిక్కారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కాలేజీల వద్ద సామాన్య దుస్తుల్లో ఉండే మహిళా పోలీసులు ఆకతాయిల చేష్టలను రికార్డ్ చేసి, ఆధారాలతో సహా వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. పట్టుబడిన వారిలో 25 మంది మైనర్లు ఉండటం సమాజంలో నైతిక విలువల పతనాన్ని సూచిస్తోంది. వీరికి వారి తల్లిదండ్రుల ముందే కౌన్సెలర్లతో 'క్లాస్' పీకిస్తున్నారు.

**రవాణా ముసుగులో రాక్షసత్వం:**

మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తుంటే కొందరు డ్రైవర్లు వక్రబుద్ధి ప్రదర్శిస్తున్నారు.

* డేటా దుర్వినియోగం: టికెట్ బుకింగ్ కోసం ఇచ్చిన ఫోన్ నంబర్‌ను అసభ్యకర సందేశాలకు వాడుకున్న ఒక ప్రైవేట్ బస్సు డ్రైవర్ ఉదంతం కలకలం రేపింది. షీ టీమ్ వేగంగా స్పందించి అతడిని కటకటాల్లోకి నెట్టింది.
* ఆటో డ్రైవర్ అరాచకం: చార్జీల విషయంలో గొడవపడి, యువతిని భయపెట్టిన ర్యాపిడో ఆటో డ్రైవర్ ఉదంతం ప్రయాణీకుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తింది. బాధితురాలు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసిన కొద్ది నిమిషాల్లోనే పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని పట్టేసుకున్నారు.

*** సామాజిక మాధ్యమాలే శాపమా?**

ప్రస్తుతం అందుతున్న ఫిర్యాదుల్లో సగానికి పైగా డిజిటల్ వేధింపులే కావడం గమనార్హం.

"ఫోన్ కాల్స్ ద్వారా 28 మంది, సోషల్ మీడియా ద్వారా 26 మంది వేధింపులకు గురయ్యారు. ప్రేమ పేరుతో బ్లాక్‌మెయిల్ చేయడం, వ్యక్తిగత ఫోటోలతో బెదిరించడం వంటి అరాచకాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు."

**మెట్రోలోనూ నిఘా నేత్రం:**

మహిళల కోచ్‌లలోకి చొరబడే పురుష పుంగవుల పీచమణిచేందుకు షీ టీమ్స్ మెట్రో రైళ్లలోనూ నిరంతరం తనిఖీలు చేస్తున్నాయి. ఈ మధ్యకాలంలో నలుగురు వ్యక్తులు మహిళల కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తూ పట్టుబడటంతో వారికి భారీ జరిమానాలు విధించారు.

**మీ వెంటే మేమున్నాం.. భయం వద్దు!**

"మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వేధింపులు ఎదురైనప్పుడు మౌనంగా భరించవద్దు" అని డీసీపీ ఉషారాణి పిలుపునిచ్చారు.

**సాయం కోసం సంప్రదించండి:**

వాట్సాప్ నంబర్: 87126 62111

ఏరియా షీ టీమ్స్: ఎల్బీనగర్ (8712662602), ఉప్పల్ (8712665299), మల్కాజిగిరి (8712662603).

# తప్పిపోయిన మతిస్థిమితం లేని వ్యక్తి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 11(భారత శక్తి): మతిస్థిమితం కలిగిన 60 ఏండ్ల వయసు కలిగిన వ్యక్తి గత నెల 29వ తేది నుండి పనికి వెళుతున్నానంటూ చెప్పి వెళ్లి 10 రోజుల నుండి కనపడకుండా పోయాడని, బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లేదని, సరూర్నగర్ పోలీస్ స్టేషన్లో కుమారుడు ఫిర్యాదు చేశారు. సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగోజిగూడలో నివసించే బైకడి ఆనంద్ తండ్రి మతిస్థిమితం లేని నర్సింహా (60)ఏండ్ల వయసు.



సరూర్నగర్ లేబర్ అడ్డాకు పని కోసం వెళ్లి 12 రోజులు అయినా తిరిగిరాలేదని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తెలిపిన వివరాలు... తప్పిపోయిన వ్యక్తి బైకడి నర్సింహా చమన ఛాయ కలిగి 5 ఫీట్ల ఎత్తు,ఎరుపు గీతల చొక్కా,నలుపు ప్యాంట్ ధరించాడని, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడని తెలిపారు. మతిస్థిమితం సరిగ్గా లేక గతంలో కూడా మూడు సార్లు చెప్పకుండా ఇంటి నుండి వెళ్ళిపోయి తిరిగి వచ్చాడని ఎవరికైనా ఇతని ఆచూకీ తెలిసినచో సరూర్నగర్ పోలీస్ స్టేషన్లో తెలపగలరని తెలియజేశారు.

# లేబర్ కోడులు కార్మిక హక్కులకు ఉరితాళ్ళు!

* **సమ్మెకు సిద్ధమవుతున్న సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు**

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11(భారతశక్తి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడులు కార్మిక హక్కులకు ఉరితాళ్ళు వంటివని వాటిని రద్దు చేయకపోతే కార్మికుల మనుగడే ప్రశ్నార్ధకంగా మారుతుందని, అందుకే ప్రతి కార్మికుడు నేడు జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి, ఐఎన్‌టియూసీ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రాంభూపాల్, టీజీబీకేఎస్ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షులు నాగెల్లి వెంకటేశ్వర్లు, ఐఎఫ్టియు మణుగూరు నాయకులు చంద్రన్న పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం కోసం బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి పని కేంద్రాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు .36% ఓట్లు వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా పార్లమెంట్లో బలం ఉందని కార్మికుల పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేయడం




ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులపై ముప్పేట దాడి చేస్తుందని విమర్శించారు. రాజకీయ అధికార బలం తోటి చట్టాలు రద్దు చేస్తే కార్మికులు సహించబోరని రాజకీయ సమ్మె ద్వారానే కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని నేతలు హెచ్చరించారు. చట్టబద్ధంగా వేతనాలు పొందే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, ఉమ్మడి బారసారాల హక్కు, కార్మికులు తమకు నచ్చిన సంఘాన్ని ఎన్నుకునే హక్కు ఇలా అన్ని రకాల హక్కుల పైన బిజెపి ప్రభుత్వం దాడి చేస్తుందని కార్మికులను బానిసలుగా మార్చి శ్రమ దోపిడీ చేయటమే ఈ లేబర్ కోడుల లక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. లేబర్ కోడులు మంచివి అంటూ సింగరేణి యాజమాన్యం కార్మిక శాఖ అధికారులతో కలిసి ప్రచారం నిర్వహించటం అత్యంత దుర్మార్గమైన చర్యగా కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. ఈ లేబర్ కోడులను రద్దు చేయకపోతే భవిష్యత్తులో బహుళ రోజుల నిరవధిక సమ్మెలు చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఈ ప్రచార కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులు ఇతియాజ్ పాషా, ఏఐటీయూసీ నాయకులు సాయి ప్రకాష్ చారి, సిఐటియు బ్రాంచ్ కార్యదర్శి వెంకటరత్నం, టీజీపీకేఎస్ నాయకులు కడారి ప్రసాద్, జగదీశ్వర రావు సిఐటియు నాయకులు ముత్యాల సుమన్, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.